కొండమోడు-పేరేచర్ల రహదారిపై

రయ్.. రయ్..

■ నాలుగు వరుసలుగా అభివృద్ధి
■ రూ.881.61 కోట్ల విడుదలకు ఆమోదం
■ వాహనదారులకు తొలగనున్న కష్టాలు

ఈనాడు కథనాలకు స్పందన

ఈనాడు – అమరావతి

పేరేచర్ల-కొండమోడు మార్గానికి మహర్దశ పట్టనుంది. నాలుగు వరుసలుగా విస్తరించడానికి నిధుల విడుదలకు కేంద్రం ఆమోదం తెలిపింది. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి. గతంలో రహదారి నిర్మాణానికి నిధులు మంజూరైనా సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. ఎట్టకేలకు అడ్డంకులు తొలగిపోయాయి. కొండమోడు-పేరేచర్ల మార్గం 49.9 కిలోమీటర్ల మేర నాలుగు వరుసలుగా విస్తరించేందుకు 2022-23 ఆర్థిక సంవత్సరంలో భారత్‌మాల కింద ఎంపిక చేశారు. గతేడాది ఆగస్టులో రూ.1032.52కోట్ల అంచనాతో టెండరును రాజేంద్రసింగ్ బేంబూ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ దక్కించుకుంది. నిధులు విడుదల కాక విస్తరణపై నీలినీడలు కమ్ముకున్నాయి. దీనిపై సమీక్షించిన రాష్ట్ర ఆర్ అండ్‌బీ మంత్రి కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీని కలిసి భారత్‌మాల కింద ఉన్న రోడ్లను జాతీయ రహదారుల సాధారణ కార్యక్రమం(ఎన్‌హెచ్‌వో) కింద కొనసాగించాలని కోరారు. కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ(మోర్త్) స్టాండింగ్ ఫైనాన్స్ కమిటీ అంగీకరించడంతో నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. ఈమేరకు ప్రభుత్వం రూ.1032.52కోట్ల అంచనాతో టెండర్లు పిలవగా రూ.881.61కోట్లకు గుత్తేదారు దక్కించుకున్నారు. ఈ రహదారి అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకతపై 'ఈనాడు' గతంలో పలు కథనాలు ఇచ్చి ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లింది.


విస్తరించనున్న పేరేచర్ల-కొండమోడు రహదారి

కొన్నేళ్లుగా ఎదురుచూపులు

గుంటూరు నుంచి హైదరాబాద్ మార్గంలో పేరేచర్ల నుంచి కొండమోడు వరకు మార్గాన్ని విస్తరించాలనేది దశాబ్దాల కల. ఈ మార్గం అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారితో కొండమోడు వద్ద అనుసంధానమై హైదరాబాద్ వెళ్లేవారికి అనుకూలం. గుంటూరు నుంచి పల్నాడు ప్రాంతం వైపు వెళ్లేవారికి కొండమోడు మార్గం కీలకం. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల సమీపంలోని కొండమోడు నుంచి గుంటూరు సమీపంలోని పేరేచర్ల వరకు జాతీయ రహదారి(167ఏజీ)గా కేంద్రం గుర్తించింది. వైకాపా సర్కారు హయాంలో కేంద్రం నిధులు మంజూరు చేసినా వివిధ కారణాలతో విడుదల కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రానికి ప్రతిపాదనలు పంపడంతోపాటు ఆర్‌అండ్‌బీ మంత్రి, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలసి నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ మార్గం విస్తరణకు గుంటూరు, సత్తెనపల్లి ఆర్డీవోల పరిధిలో 234 హెక్టార్ల భూమి సేకరణ ప్రక్రియను జిల్లాల యంత్రాంగం పూర్తి చేసింది.

అత్యంత కీలకమైన మార్గం

గుంటూరు నుంచి పల్నాడు, హైదరాబాద్ వెళ్లేవారికి ఇది అత్యంత అనుకూలం. కొండమోడు-పేరేచర్ల మార్గం ప్రస్తుతం 7 నుంచి 10మీటర్ల వెడల్పుతో ఉండటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. విస్తరణ పూర్తయితే హైదరాబాద్ నుంచి రాజధాని అమరావతికి ప్రయాణ సమయం తగ్గుతుంది. సీఆర్‌డీఏ నిర్మించే బాహ్యావలయ రహదారికి సత్తెనపల్లి వద్ద ఈమార్గం అనుసంధానమవుతుంది. నాలుగు వరుసల విస్తరణలో ఒక్కొక్క వైపు 8.75 మీటర్ల వెడల్పు రహదారి, డివైడర్ 1.5 మీటర్లు, రెండువైపులా మార్జిన్‌లు కలిపి 22.5 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తారు. మేడికొండూరులో 4 నుంచి 5 కిలోమీటర్లు బైపాస్, సత్తెనపల్లిలో 11 కిలోమీటర్ల బైపాస్ నిర్మిస్తారు.

నెలరోజుల్లో పనులు



కొండమోడు-పేరేచర్ల రహదారి నాలుగు వరుసలుగా విస్తరణకు కేంద్రం రూ.881.61 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికే టెండరు ప్రక్రియ పూర్తయి గుత్తేదారును ఎంపిక చేశారు. నెల రోజుల్లోనే పనులు ప్రారంభిస్తారు. భూసేకరణ ప్రక్రియ మొత్తం పూర్తయింది. రైతుల ఖాతాలకు నిధులు జమ చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

– లావు శ్రీకృష్ణదేవరాయలు, పార్లమెంటు సభ్యులు, నరసరావుపేట

శంకర్‌విలాస్ ఆర్వోబీకి రూ.98 కోట్లు

విడుదల చేసిన కేంద్రం
త్వరలోనే టెండర్ల ఖరారు

ఈనాడు, అమరావతి: గుంటూరు - నల్లపాడు రైల్వేసెక్షన్ పరిధిలోని శంకర్‌విలాస్ వంతెనను నాలుగు వరుసలుగా విస్తరించేందుకు కేంద్రం సేతు బంధన్ పథకం కింద రూ. 98 కోట్లను విడుదల చేసింది. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్‌దండేకి కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి సందీప్‌కుమార్ సింగ్ ఉత్తర్వులు పంపించారు. నిధులు విడుదల చేశామని, వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అందులో పేర్కొన్నారు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో నగర పాలక సంస్థ భూసేకరణకు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేసింది. క్షేత్రస్థాయిలో వంతెనకిరువైపులా అరండల్‌పేట, బ్రాడీపేట వైపు స్థల సేకరణ వల్ల కోల్పోయే నిర్మాణాలను అధికారులు పరిశీలించారు. వంతెన నిర్మాణానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం అధికారిక ప్రకటన విడుదల చేయడంపై కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.

మూడ ముచ్చట.. మూడు ఇచ్చుట!


● పొట్టిపాడు నుంచి చినకాకాని వయా గోసాల
● తూర్పు బైపాస్‌కు మూడు ప్రతిపాదనలు
● ఎట్టకేలకు సవివర నివేదిక పూర్తి
● సీఎం చంద్రబాబు నిర్ణయం కోసం నిరీక్షణ

ఈనాడు – అమరావతి

విజయవాడ నగర ట్రాఫిక్ రద్దీని నియంత్రించి రింగు రోడ్డుగా మారే తూర్పు బైపాస్ నిర్మాణం అరమరిక (అలైన్‌మెంట్)పై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. సవివర నివేదిక పూర్తి చేశారు. భూసేకరణ ప్రారంభించడమే తరువాయి. వచ్చే మార్చి లోపల టెండర్లు పిలిచి అప్పగించేలా సన్నాహాలు చేస్తున్నారు. మూడు ప్రతిపాదనలను కన్సల్టెన్సీ సంస్థలు రూపొందించి ఎన్‌హెచ్‌ఏఐకు అందించాయి. వీటిని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదానికి పంపినట్లు తెలిసింది. ఆయన పరిశీలించాక కేంద్రానికి పంపి ఎన్‌హెచ్‌ఏఐ టెండర్లను ఆహ్వానించనుంది. డిసెంబరులోగా టెండర్లు పిలిచే వీలుంది. డీపీఆర్ రూపొందించిన సంస్థలు రెండో ప్రతిపాదన అనువు అని సిఫార్సు చేసినట్లు తెలిసింది. డీపీఆర్‌ను 'ఈనాడు' సంపాదించింది. వివరాలు ఇవీ..

ప్రతిపాదనలు ఇవీ...

జాతీయ రహదారి-16 (చెన్నై-కోల్‌కత్తా) విస్తరణలో భాగంగా విజయవాడకు బైపాస్ రహదారి నిర్మిస్తున్నారు. ఇది నగరానికి పశ్చిమవైపు కృష్ణా నది మీదుగా వెళుతుంది. ఎన్‌హెచ్-16 విజయవాడ నగరం బెంజిసర్కిల్, మహానాడు జంక్షన్, రామవరప్పాడు మీదుగా వెళుతుంది. ట్రాఫిక్ ఎక్కువ ఉండటం.. సర్వీసు దారులూ లేకపోవడంతో ప్రమాదాలు పెరిగాయి. దీంతో రహదారి విస్తరణ కాజా నుంచి కృష్ణా నది మీదుగా గొల్లపూడి, నున్న మీదుగా చిన్నఆవుటపల్లి వరకు బైపాస్ నిర్మిస్తున్నారు. దీనికి వ్యతిరేక దిశలో ఒక బైపాస్ నిర్మిస్తే.. అనువుగా ఉంటుందని గత తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించారు. దీనికి జాతీయ రహదారుల సంస్థ అంగీకరించి, భూసేకరణ రాష్ట్ర ప్రభుత్వం భరించాలని కోరింది. తర్వాత ప్రభుత్వం మారింది. తూర్పు బైపాస్‌కు కేడీఎం, చైతన్య కన్సల్టెన్సీ సంస్థలు సవివర నివేదిక (డీపీఆర్)ను రూపొందించే బాధ్యత అప్పగించారు.



★ కన్సల్టెన్సీ సంస్థలు రెండో ప్రతిపాదన సిఫార్సు చేశాయి. అన్ని ప్రతిపాదనలు పొట్టిపాడు వద్ద ప్రారంభమై చినకాకాని వద్ద ఎన్‌హెచ్-16లో కలుస్తాయి. రెండు ప్రాంతాల్లోనూ జంక్షన్ నిర్మాణం సులువుగా ఉంటుందని ప్రతిపాదించాయి. రెండో ప్రతిపాదన ప్రకారం పశ్చిమ బైపాస్‌లోకి సులభంగా ప్రవేశించే వీలుంది. ★ విజయవాడ నగరానికి కొంత దూరంగా ఉండటంతో భూసేకరణ వ్యయం తగ్గే వీలుంది. నగరానికి దగ్గరగా వచ్చిన కొద్దీ భూసేకరణ వ్యయం పెరుగుతుంది.

★ విమానాశ్రయానికి దూరంగా అలైన్‌మెంట్ ఉండటంతో ఎయిర్‌పోర్టు అథారిటీ నుంచి ఎలాంటి అభ్యంతరాలు ఉండవు. ★ కృష్ణా నదిపై నిర్మించే వంతెన మొదటి, మూడో ప్రతిపాదనల కన్నా రెండో ప్రతిపాదనలో నిర్మించే దూరం (3.355కిమీ) తక్కువ. ★ బందరు పోర్టు కనెక్టివిటీకి ఎన్‌హెచ్-65 నుంచి అనుసంధానం సులభంగా ఉంటుంది. మిగిలిన తొలి, మూడు ప్రతిపాదనల కంటే రెండో ప్రతిపాదనలో వంతెనల నిర్మాణం కేవలం 8 మాత్రమే ఉంటాయి. ★ ఆర్వోబీల నిర్మాణం కూడా సులభంగా పూర్తి చేయవచ్చు.

అరమరిక ఇలా..!

తూర్పు బైపాస్ రెండు జిల్లాల్లో ఉంటుంది. కృష్ణా జిల్లాలో ఉంగుటూరు, గన్నవరం, కంకిపాడు, పెనమలూరు మండలాల మీదుగా వెళుతుంది. గుంటూరు జిల్లాలో దుగ్గిరాల మంగళగిరి మండలాల మీదుగా చినకాకాని చేరుతుంది.

★ **కృష్ణా జిల్లాలో** పొట్టిపాడు, ఆత్కూరు, పెదఆవుటపల్లి, చిన్నఆవుటపల్లి, అల్లాపురం, బుద్ధవరం, అజ్జంపూడి, కేసరపల్లి, మంతెన-1, ఉప్పులూరు, జగన్నాథపురం, మంతెన-2, పునాదిపాడు, గొడవర్రు, మద్దూరు, గోసాల, వణుకూరు మీదుగా కృష్ణా నది దాటుతుంది.

★ **గుంటూరు జిల్లాలో** పెదకొండూరు, చినపాలెం, శృంగారపురం, తుమ్మపూడి, చిలువూరు, చినవడ్లపూడి, పెదవడ్లపూడి, చినకాకాని గ్రామాల్లో భూసేకరణ చేయాలి.

★ కృష్ణా జిల్లాలో 59.036 శాతం దూరం ఉంటే.. గుంటూరు జిల్లాలో 40.964 శాతం దూరం ఉంది. మూడు ప్రతిపాదల్లో రెండో ప్రతిపాదన ఖర్చు ఎక్కువ.. రూ.4,596.29 కోట్లు.

మంగళగిరిలో.. స్వర్ణ కాంతులు

స్వర్ణకార కార్పొరేషన్‌కు ఆమోదంపై సంబరాలు
మంత్రి లోకేశ్‌కు వృత్తిదారుల కృతజ్ఞతలు

మంగళగిరి, న్యూస్‌టుడే


మంగళగిరిలో మిఠాయిలు పంచుతున్న నాయకులు

స్వర్ణకారుల జీవితాలు ప్రకాశించనున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని, మంగళగిరిని గోల్డ్ హబ్‌గా తీర్చిదిద్దుతామని నారా లోకేశ్ ఎన్నికల ముందు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చారు. ఆయన చొరవతో వారి సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకానుంది. ఇందుకు గానూ బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశం నిర్ణయం తీసుకుంది. దీంతో మంగళగిరిలోని ఆ వృత్తిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. డీజే సౌండ్లు, బాణసంచా కాల్పులతో ఉత్సాహంగా నృసింహుని ఆలయం వద్దకు చేరుకున్నారు. స్వామివారి సన్నిధిలో కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించి మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం స్థానికులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

గత వైకాపా ప్రభుత్వం కార్పొరేషన్ ఇస్తున్నట్లు మభ్యపెట్టింది. ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలకు మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు ముందడుగు పడింది. మంగళగిరిలో సుమారు 20 వేల మంది స్వర్ణకార వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వ్యాపారంలో అనేక ఒడుదొడుకులు ఏర్పడుతున్నా వాటిని తట్టుకుని ముందుకు సాగుతున్నారు. లోకేశ్ ప్రతిపక్షంలో ఉన్న సమయంలోనూ సొంత నిధులతో స్వర్ణకార వృత్తికి అవసరమైన అనేక పరికరాలు అందించారు. అంతేకాక శ్రీలక్ష్మీనృసింహ గోల్డ్‌స్మిత్ వెల్ఫేర్ సొసైటీ ఏర్పాటు చేయించారు. దాని ద్వారా అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి పేదలను ఆదుకున్నారు. మంగళగిరిని 'గోల్డ్‌హబ్'గా మార్చడంలో ఇది తొలిఅడుగని స్థానిక స్వర్ణకారులు పేర్కొంటున్నారు.

మెరుగైన ఉపాధి..

– గుంటి నాగరాజు, అధ్యక్షుడు, శ్రీలక్ష్మీనృసింహస్వామి గోల్డ్‌స్మిత్ వెల్ఫేర్ సొసైటీ



కార్పొరేషన్ ఏర్పాటు ద్వారా స్వర్ణకారులకు మెరుగైన ఉపాధి లభిస్తుంది. వారిలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి అవకాశం కలుగుతుంది. ఎన్నికల ముందు మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీని అమలు చేశారు. ఎంతో ఆనందంగా ఉంది. గత పాలకులు మాటలకే పరిమితమయ్యారు.

120 రోజుల్లో హామీ అమలు..

– గాజుల శ్రీనివాసరావు



హామీ ఇచ్చిన 120 రోజుల్లో మంత్రి లోకేశ్ స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉంది. రాష్ట్రంలో బంగారు ఆభరణాల తయారీ పనిపై ఆధారపడిన వారందరికీ దీని ద్వారా లబ్ధిచేకూరుతుంది.

చిరకాల స్వప్నం నెరవేరింది..

– పడవల మహేష్



ఎంతోమంది ఉపాధి లేక స్వర్ణకార వృత్తికి దూరమయ్యారు. ఇప్పుడు వారందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయి. చిరకాల స్వప్నం నెరవేర్చిన మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు.

కష్టాలు తీరతాయి..

– జొన్నాధుల బాలకృష్ణ



స్వర్ణకార వృత్తిదారులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. కార్పొరేషన్ ఏర్పాటుతో ఆ కష్టాలు తీరతాయి. మంగళగిరిని గోల్డ్‌హబ్‌గా తీర్చిదిద్దాలని మంత్రి లోకేశ్‌కు విన్నవిస్తున్నా.

నాడు వైకాపా హయాంలో రెచ్చిపోయిన బోరుగడ్డ అనిల్

రౌడీ ఆటకట్టు

గుంటూరులో దందాలు, దౌర్జన్యాలతో హల్‌చల్



ఈనాడు – అమరావతి, పట్టాభిపురం – న్యూస్‌టుడే

రౌడీషీటర్.. నాడు సీఎం జగన్ అనుచరుడిగా జనాన్ని హడలగొట్టిన బోరుగడ్డ అనిల్‌కుమార్ ఎట్టకేలకు బుధవారం పోలీసుల చేతికి చిక్కాడు. వైకాపా అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో అతని అరాచకానికి హద్దే లేకుండా పోయింది. పోలీసులు సైతం అతనివైపు చూడాలంటేనే భయపడే పరిస్థితి కల్పించాడు. 2021లో కర్లపూడి బాబుప్రకాష్‌ను రూ. 50 లక్షలు ఇవ్వాలంటూ బెదిరించిన కేసులో తాజాగా పోలీసులు అరెస్టు చేశారు.

గుంటూరు నగరానికి చెందిన అనిల్ కేంద్ర మంత్రిగా పని చేసిన రాందాస్ అథవాలే అనుచరుడిగా చెప్పుకొంటూ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడిగా చలామణి అయ్యాడు. జగన్‌ను అన్నా అంటూ సంబోధిస్తూ తానూ పులివెందులకు చెందినవాడినేనంటూ వైకాపాతో అంటకాగాడు. జగన్‌కు తొత్తుగా వ్యవహరిస్తూ ప్రతిపక్షాలు, ప్రతిపక్షనేతలపై సభ్య సమాజం తలదించుకునేలా సామాజిక మాధ్యమాలు, టీవీ డిబేట్‌లలో ఇష్టాను సారం దూషణలు చేశాడు. వైకాపా ఐదేళ్ల పాలనలో జగన్‌కు వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడినా వారిపై అసభ్యకర పదజాలంతో విరుచుకుపడేవాడు. జగన్‌ను వ్యతిరేకిస్తూ మాట్లాడితే చంపేస్తానంటూ బెదిరింపులకు దిగేవాడు. చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్, లోకేష్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశాడు. ప్రతిపక్షాలకు చెందిన మహిళల గురించి అసభ్యకరంగా మాట్లాడి దూషించేవాడు. అప్పట్లో జగన్ పేరు చెప్పి గుంటూరు నగరంలో దందాలు, దౌర్జన్యాలతో హల్‌చల్ చేశాడు. నాడు అధికార పార్టీ వైకాపా అండదండలు ఉండటంతో ఇష్టారాజ్యంగా చెలరేగిపోయాడు. జగన్ పేరు చెబుతుండటంతో పోలీసుల అతని వైపు కన్నెత్తి చూడలేదు. ఇదే అదనుగా అతను దందాలు, దౌర్జన్యాలు చేస్తూ నానా బీభత్సం సృష్టించాడు.

అప్పటి వైకాపా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి జగన్‌తో విభేదించి విమర్శలు చేయడంతో నెల్లూరు వచ్చి బండికి కట్టేసి లాక్కెళ్లిపోతానని ఫోన్‌లో బెదిరించిన అంశం రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైనా పోలీసులు పట్టించుకోలేదు. బోరుగడ్డ అనిల్ నివాసం ఉండే బృందావన్‌గార్డెన్స్ ప్రాంతంలో అర్ధరాత్రి వేళ కార్లలో వెళుతూ పెద్ద పెద్దగా హారన్‌లతో శబ్దాలు చేస్తూ స్థానికులకు ఐదేళ్లపాటు నరకం చూపించాడు. అతను నివాసం ఉండే మరో ప్రాంతమైన వేళాంగణినగర్‌లో అతని ఇంటిమీదుగా వెళుతున్న వారిని అటకాయించి మా ఇంటివైపు ఎందుకు చూశారని దాడి చేసేవాడు. స్థానికులు ఎదురుతిరిగితే పోలీసులు అనిల్‌కు రక్షణగా నిలిచారే కానీ కేసు నమోదుకు వెనుకాడారు. గుంటూరు ప్రభుత్వ సమగ్రాసుపత్రిలో తన అనుచరులకు సకాలంలో వైద్యం చేయలేదని విధుల్లో ఉన్న జూనియర్ వైద్యులపై దాడికి దిగి వీరంగం సృష్టించాడు. ఈ ఘటనతో జూడాలు రెండురోజులపాటు ఆందోళన చేసినా అప్పటి కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేయకపోవడం గమనార్హం.

పలు పోలీసుస్టేషన్లలో కేసులు

బోరుగడ్డ అనిల్‌పై గుంటూరుతో పాటు గతంలో అనంతపురంలో కూడా ఒక కేసు నమోదయింది. అనుచరులతో కలిసి ఉద్దేశపూర్వకంగా వెళ్లి గాయపరచడం, అమ్మాయిలను వేధించిన కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. అనుచరులతో వెళ్లి రాళ్లు, కర్రలతో దాడి చేసినా ఒక్క హత్యాయత్నం కూడా నమోదు కాలేదు. గుంటూరు నగరంలో కార్ల కాన్వాయ్‌తో హారన్‌లతో పెద్దగా శబ్దాలు చేస్తూ ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పట్టించుకోకుండా ఎక్కడా ఆపకుండా వెళ్లినా పోలీసులు పట్టించుకోలేదు. అర్ధరాత్రి సమయంలో సైరన్ మోగిస్తూ పరిసర ప్రాంతాల్లో నివాసం ఉన్న వారికి నరకం చూపించాడు. గుంటూరు నగరంలోని మంగళదాస్‌నగర్‌లో బీటెక్ విద్యార్థిని రమ్య హత్య జరిగిన సమయంలో జాతీయ మహిళా కమిషన్ గుంటూరుకు వస్తే బోరుగడ్డ అనిల్ పదుల సంఖ్యలో కార్లలో అనుచరులతో వచ్చి ఇతరులెవరూ వినతిపత్రాలు ఇవ్వకుండా అడ్డుకున్నాడు. ఆర్‌అండ్‌బీ బంగ్లా, బాధితుల ఇంటి వద్ద హల్‌చల్ చేశాడు.

★ జగన్ ఆదేశిస్తే చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లను చంపుతానని అనిల్ గతంలో బహిరంగంగా ప్రకటించాడు.

రీసైక్లింగ్‌కు మాంసం వ్యర్థాలు

దుకాణదారులకు నోటీసులు

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరు నగరంలో మాంసం వ్యర్థాల రీసైక్లింగ్‌పై జీఎంసీ దృష్టి పెట్టింది. నగరంలో ఉన్న 320కిపైగా దుకాణాల నుంచి నిత్యం ఆరేడు టన్నుల వ్యర్థాలు వస్తున్నట్టు అంచనా. వీటిని డెల్టా ప్రాంతంతోపాటు బాపట్ల, రేపల్లెల్లోని చేపలు, రొయ్యల చెరువులకు అనధికారికంగా సరఫరా చేస్తున్నారు. ఇది ప్రజారోగ్యానికి విఘాతమని గతంలో కలెక్టరుకు ఫిర్యాదులందాయి. కొంతమంది న్యాయస్థానాలకూ వెళ్లడంతోపాటు కాలుష్య నియంత్రణ మండలి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో నాటి జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి మాంసం వ్యర్థాల రీసైక్లింగ్ యూనిట్‌కు ఆ వ్యర్థాలను పంపేలా చర్యలు చేపట్టారు. అప్పట్లో ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. ప్రస్తుతం 90 రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణపై దృష్టి పెట్టిన అధికారులు మాంసం వ్యర్థాల సమస్యను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకున్నారు. మరోవైపు స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌ను మెరుగుపరిచేందుకూ ప్రయత్నిస్తున్నారు. నగరవ్యాప్తంగా వ్యర్థాలను సేకరించే బాధ్యతను ఒక ఏజెన్సీకి అప్పగించారు. ఇది పశ్చిమ గోదావరి జిల్లాలోని ఉండిలో ఉన్న రీసైక్లింగ్ యూనిట్‌కు తరలిస్తుంది. జీఎంసీ నుంచి అనుమతులు తీసుకున్న దుకాణాల వారు తప్పనిసరిగా వ్యర్థాలను ఏజెన్సీకి అప్పగించాలంటూ ప్రజారోగ్య అధికారులు నోటీసులిస్తున్నారు.

ఏఎన్‌యూ దూరవిద్యా కేంద్రం పరీక్షలు వాయిదా

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని దూరవిద్యా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి నిర్వహించాల్సిన యూజీ, పీజీ 1, 3 సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేశారు. తుపాను ప్రభావంతో ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయని.. పరీక్షలు వాయిదా వేయాలని విద్యార్థుల నుంచి విశ్వవిద్యాలయానికి వినతులు వచ్చాయి. పరిశీలించిన అధికారులు పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ పరీక్షలు వచ్చే నెల 17 నుంచి ప్రారంభమవుతాయని సమన్వయకర్త డాక్టర్ రామచంద్రన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 నుంచి జరగాల్సిన 2, 4వ సెమిస్టర్ పరీక్షలు యథాతథంగా జరుగుతాయని రామచంద్రన్ చెప్పారు.

అనిల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి


పోలీస్‌స్టేషన్ వద్ద తెదేపా నేతల ఆందోళన

పట్టాభిపురం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు జగన్ అండ చూసుకొని రెచ్చిపోయి అక్రమాలు, అరాచకాలకు పాల్పడిన బోరుగడ్డ అనిల్‌కుమార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని తెదేపా నేతలు డిమాండ్ చేశారు. అతడిని పోలీసులు అరెస్టు చేసి నల్లపాడు ఠాణాలో ఉంచిన విషయం తెలుసుకున్న తెదేపా ఎస్సీ సెల్ నాయకులు బోరుగడ్డ వెంకటరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, కార్పొరేటర్ వేములపల్లి శ్రీరాంప్రసాద్, జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణ, తెదేపా నాయకులు దొడ్డపనేని రాజేంద్ర, మంచోడు మణి, పులవర్తి అజార్‌తో పాటు పలువురు నాయకులునల్లపాడు ఠాణా వద్దకు చేరుకున్నారు. అనిల్‌కుమార్‌కు రాచ మర్యాదలు చేయడమేమిటని పోలీసుల్ని ప్రశ్నించారు. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు అతను చేయని అరాచకం లేదని, నోటికొచ్చినట్లు చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ సహా వారి కుటుంబ సభ్యుల్ని అసభ్యపదజాలంతో దూషించాడని పేర్కొన్నారు. అనిల్‌కుమార్ పై లెక్కలేనన్ని కేసులున్నాయని, అలాంటి వ్యక్తికి రాచమర్యాదలు చేస్తారా? అంటూ పోలీసులను ప్రశ్నించారు.


నల్లపాడు ఠాణా వద్ద తెదేపా నాయకులు

★ తన భర్తను అక్రమంగా అరెస్టు చేశారని, ఆయనకేమైనా జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత అని అనిల్ భార్య మౌనిక వీడియో విడుదల చేశారు.

బండలు జారుతున్నాయ్.. గుండెలదురుతున్నాయ్!



కొండరాళ్లు దొర్లిపడుతూ..



రాళ్లు పడి విరిగిన రెయిలింగ్

సీతానగరం వైపు కొండరాళ్లు దొర్లి.. సందర్శకులు సేదతీరేందుకు ఏర్పాటు చేసిన పార్కు గేట్లపై పడటంతో.. గేట్లు సైతం విరిగిపోయాయి. ఈ కొండ పక్క నుంచి నిత్యం వందల మంది స్థానికులు రాకపోకలు సాగిస్తుంటారు. బ్యారేజీ నీటి ప్రవాహాన్ని తిలకించడానికి కూడా సందర్శకులు ఇక్కడికే వస్తుంటారు. కొండ పక్కనే రక్షణ చర్యలు చేపట్టకపోతే భారీ మూల్యం తప్పదు. -ఈనాడు,గుంటూరు

మాతృ మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో మాతృమరణాలు సంభవించకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీసీ హాలులో బుధవారం జిల్లా స్థాయి మాతృ మరణాల సమీక్ష కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు జరిగిన అయిదు మాతృ మరణాలపై సంబంధిత వైద్యాధికారులు, బాధితుల బంధువులతో కలెక్టర్ మాట్లాడారు. అందుకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మున్ముందు ఇటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. హై రిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి సమీపంలోని జిల్లా ఆసుపత్రికి ట్యాగ్ చేయాలన్నారు. ప్రసవానికి ముందుగానే వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేలా ఉచిత రవాణా సదుపాయాన్ని ఉపయోగించుకోవాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, డీసీహెచ్‌ఎస్ ఎం.మజీదాబి, డీఐవో డాక్టర్ లక్ష్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాస్ కార్యక్రమం విజయవంతం చేద్దాం

కలెక్టరేట్(గుంటూరు): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సక్రమంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీసీ హాలులో బుధవారం జిల్లా స్థాయి కమిటీ కన్వర్జెన్స్ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం శిక్షణ పూర్తి చేసి నవంబరు 5వ తేదీ నుంచి తరగతులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తరగతుల నిర్వహణకు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రాల్లో అనుకూలమైన గదులను గుర్తించాలన్నారు. సమావేశంలో వయోజన విద్యాశాఖ డీడీ బి.జగన్మోహనరావు, డీఆర్డీఏ డీపీఎం మురళి, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, డీపీవో సాయికుమార్, డీఈవో శైలజ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రారంభం

ఐదేళ్ల తర్వాత ప్రముఖ కంపెనీల మద్యం, బీర్లు



దుకాణంలో సిద్ధంగా ఉన్న ప్రముఖ కంపెనీల మద్యం సీసాలు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: నూతన మద్యం విధానం బుధవారం నుంచి అమల్లోకి వచ్చింది. లాటరీ పద్ధతిలో 127 దుకాణాలను దక్కించుకున్న వ్యాపారుల్లో అధిక శాతం మంది గతంలో ప్రభుత్వ దుకాణాలుగా వినియోగించిన భవనాల్లోనే విక్రయాలు ప్రారంభించారు. స్థానికుల నుంచి అభ్యంతరాలు వచ్చిన ప్రాంతాల్లో వేరేచోట ఏర్పాటు చేశారు. వివిధ బ్రాండ్ల మద్యం సీసాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. గత ఐదేళ్లుగా నాసిరకం బ్రాండ్లను తాగాల్సి వచ్చిందని పలువురు చెప్పారు. ఇపుడు ప్రముఖ కంపెనీల బీర్లు, నాణ్యమైన మద్యం అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ★ బుధవారం ఉదయం నుంచే మందుబాబులు దుకాణాల వద్ద బారులు తీరారు. ప్రభుత్వ దుకాణాల్లోని పాత సరుకును మంగళవారం అర్ధరాత్రి వరకు అధికారులు లెక్క చూసి డిపోలకు పంపించారు. బుధవారం ఉదయం నుంచి కొత్త స్టాక్‌ను ప్రైవేటు దుకాణాలకు తరలించారు. అన్ని దుకాణాలకు సకాలంలో రాకపోవడంతో ప్రారంభోత్సవం కొంత ఆలస్యమైంది. ★ ముహూర్తం కోసం కొంతమంది వ్యాపారులు బుధవారం సాయంత్రం వరకు దుకాణాలను ప్రారంభించలేదు.

24 నుంచి యువజనోత్సవాలు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈనెల 24 నుంచి యువజనోత్సవాలు నిర్వహించనున్నారు. సంగీతం, థియేటర్, ఫైన్ ఆర్ట్స్, క్విజ్, వ్యాసరచన విభాగాలలో పోటీలు ఉంటాయని ఉత్సవాల సమన్వయకర్త ఆచార్య మురళీమోహన్ చెప్పారు. సహాయ సమన్వయకర్తగా ఆచార్య జాన్సన్ వ్యవహరిస్తారని చెప్పారు.

మ్యాక్స్.. దొరికిందోచ్!



పెంపుడు శునకం మ్యాక్స్‌తో యజమాని మోజెస్

అల్లారు ముద్దుగా పెంచుకున్న పెంపుడు శునకం ఇంట్లో నుంచి తప్పిపోవడంతో యజమాని కుటుంబ సభ్యులు విలవిల్లాడిపోయారు. అనేక విధాలుగా అన్వేషణ చేశారు. చివరికి అది దొరకడంతో ఊరట చెందారు. బ్రాడీపేటకు చెందిన మోజెస్ రెండేళ్ల నుంచి మ్యాక్స్ అనే జర్మన్ షెఫర్డ్ జాతికి చెందిన శునకాన్ని ఎంతో ఇష్టంగా పెంచుకుంటున్నారు. ఈనెల 10న అది ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయింది. ఇంటిల్లిపాది వీధులన్నీ వెతికారు. కనిపించిన వాళ్లందరినీ ఆరా తీశారు. మోజెస్ అరండల్‌పేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడితో ఆగకుండా.. కుక్క ఫొటో, చిరునామా, ఫోన్ నంబర్ల వివరాలతో ఫ్లెక్సీలు వేశారు. కరపత్రాలు ముద్రించి.. నగరమంతా పంచారు. ఆటోల వెనుక అంటించారు. టీవీల్లో ప్రకటనలూ ఇచ్చారు. బుధవారం ఓ ఆటో డ్రైవర్.. పట్టాభిపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి వద్ద ఆ శునకాన్ని గుర్తించారు. యజమానికి ఫోన్ చేసి చెప్పారు. కుటుంబ సభ్యులు వెంటనే వచ్చి.. మ్యాక్స్‌ను అక్కున చేర్చుకున్నారు. తప్పిపోయిందనుకున్న కుక్క తిరిగి వచ్చేసరికి వారి ఆనందానికి అవధుల్లేవు. వారు చూపిన జంతుప్రేమకు అంతా ఫిదా అయ్యారు. – న్యూస్‌టుడే, బ్రాడీపేట

18న మినీ జాబ్ మేళా

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ఈనెల 18న మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు గుజ్జనగుండ్లలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో మేళా జరుగుతుందని వెల్లడించారు. ఆసక్తి కలిగిన యువత వివరాలకు 9866822697, 8790790762 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

నవంబరు 16న శబరిమలకు ప్రత్యేక రైలు

గుంటూరు రైల్వే: శబరిమల వెళ్లే భక్తుల సౌకర్యార్థం నవంబరు 16న సికింద్రాబాద్ నుంచి ఐఆర్‌సీటీసీ ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలు గుంటూరు మీదుగా వెళ్లనుంది. ఈ రైలు సికింద్రాబాద్‌లో 08.00 గంటలకు బయలుదేరి గుంటూరు 14.45కి వచ్చి మరుసటిరోజు చెంగనూరు 19.00 గంటలకు చేరనుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు ఎర్నాకులంలో 12.00 గంటలకు ప్రారంభమై.. మరుసటిరోజు గుంటూరు 14.40, సికింద్రాబాద్ 21.45 గంటలకు చేరనుంది. పూర్తి వివరాలకు 9281030714 నంబరులో సంప్రదించవచ్చు.

నేటి నుంచి దక్షిణ మండల అథ్లెటిక్స్

ఎ.ఎన్.యు: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏఎన్‌యూలోని సింథటిక్ మైదానంలో నిర్వహించే ఈ పోటీల్లో ఆరు రాష్ట్రాలు, ఒక కేంద్ర ప్రాంతానికి చెందిన 848 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు.

పట్టభద్రులూ... ఓటర్లుగా నమోదు చేసుకోండిలా!



కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే

నవంబరు 6 వరకే అవకాశం

శాసనమండలి ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో ఓటు వేసేందుకు పట్టభద్రులు ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవాలని ఎన్నికల అధికారులు చెబుతున్నారు. నమోదుకు నవంబరు 6 వరకు గడువు ఉంది. అవసరమైన పత్రాలను ఆయా మండలాల్లోని తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల్లో అందుబాటులో ఉంచామని, ceoandhra.nic.in వెబ్‌సైట్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని అధికారులు వివరించారు.

గతంలో దరఖాస్తు చేసుకున్నా...

గత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకున్న వారు సైతం మళ్లీ.. కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిందే. పాత ఓటర్ల జాబితా రద్దవుతుంది. ఎప్పటికప్పుడు కొత్త జాబితాతోనే ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహిస్తారు.

కీలకాంశాలు...

★ 2021 సెప్టెంబరునాటికి డిగ్రీ పూర్తి చేసినవారు అర్హులు. అప్పట్లోగా డిగ్రీ పూర్తి చేసినవారు 2025లో జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఇప్పుడే ఓటరుగా నమోదు చేయించుకోవాలి. ★ ఓటు నమోదుకు సంబంధించి రెండు జిల్లాలకు ఈఆర్వోగా గుంటూరు జిల్లా రెవెన్యూ అధికారి వ్యవహరిస్తారు. ఆయా మండలాల తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, అదనపు కమిషనర్లు ఏఈఆర్వోలుగా, ఎంపీడీవోలు డిజిగ్నేటెడ్ అధికారులుగా, పోస్టుమాస్టర్లు, ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లు అదనపు డిజిగ్నేటెడ్ అధికారులుగా వ్యవహరిస్తారు. ★ ఒకే కుటుంబంలో పదిమంది పట్టభద్రులుంటే వారందరి దరఖాస్తులను సంబంధిత ఏఈఆర్వోకు ఇవ్వొచ్చు. ★ ప్రైవేటు సంస్థల్లో పని చేస్తున్నవారు పూర్తి చేసిన దరఖాస్తులను సంస్థ ప్రతినిధి ద్వారా ఏఈఆర్వోకు అందివ్వొచ్చు. దరఖాస్తులో పేర్కొన్న చిరునామా ప్రకారం ఆ ప్రాంతంలోని ఏఈఆర్వోకే ఇవ్వాల్సి ఉంటుంది. ★ ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందినవారు ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేస్తున్నట్లయితే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేయొచ్చు. కచ్చితంగా స్వీయ, గెజిటెడ్ అధికారి ధ్రువీకరణ తప్పనిసరి. ★ దరఖాస్తులను సంబంధిత బీఎల్‌వోలు పరిశీలించి పేర్లను ఓటరు జాబితాలో చేర్చేందుకు చర్యలు చేపడతారు.

2019 పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో ఓటర్ల వివరాలు	
ఉమ్మడి గుంటూరు జిల్లా:	1,41,970
ఉమ్మడి కృష్ణా జిల్లా:	1,06,829

అవసరమైన పత్రాలు

✪ ఓటు దరఖాస్తు ఫారం-18 ✪ డిగ్రీ ప్రొవిజినల్ లేదా ఒరిజినల్ డిగ్రీ ధ్రువపత్రం ✪ ఆధార్ నకలు ✪ ఓటరు ఐడీ ✪ పాస్‌పోర్టు ఫొటో ✪ చరవాణి నంబరు ✪ ప్రతీ పత్రంపైనా స్వీయ, గెజిటెడ్ అధికారి ధ్రువీకరణలు ఉండాలి.


మంత్రి లోకేశ్ 'ప్రజా దర్బార్'కు వినతుల వెల్లువ



దివ్యాంగురాలి సమస్య వింటున్న మంత్రి

తాడేపల్లి, న్యూస్‌టుడే: వివిధ జిల్లాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను ఆయా ప్రాంతవాసులు మంత్రి లోకేశ్‌కు విన్నవించారు. ఉండవల్లి నివాసంలో బుధవారం నిర్వహించిన 'ప్రజా దర్బార్'లో మంత్రి ప్రజల్ని నేరుగా కలుసుకుని వినతులు స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి భరోసా ఇచ్చారు. ఎన్టీఆర్ జిల్లా కొత్తపేటలోని 1.10 ఎకరాల భూమిని నరసింహారావు అనే వ్యక్తి కబ్జాచేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని జి.వెంకటేశ్వరరావు మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు. ★ 45 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన 10.39 ఎకరాలు వ్యవసాయ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని ప్రకాశం జిల్లా ఎర్రగుండపాలేనికి చెందిన వెన్నం బాలగంగాధర్ తిలక్, తిరుపతి శ్రీవేంకటేశ్వర విద్యాలయంలో మూడేళ్లుగా పనిచేస్తున్న 30 మంది బోధనేతర సిబ్బందిని ఉద్యోగాల నుంచి తొలగించారని తిరిగి తమను విధుల్లోకి తీసుకోవాలని నాన్‌టీచింగ్ సిబ్బంది, ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు లోని పులివాగు ఆక్రమణలను తొలగించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని అదే గ్రామానికి చెందిన గుంటక సుబ్బారెడ్డి వినతులు ఇచ్చారు.

సామాజిక సేవలో రతన్ టాటా ఆదర్శనీయులు



రతన్ టాటా విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి మనోహర్, పక్కన శిల్పులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే : సంపాదన మాత్రమే కాకుండా ధనాన్ని సమాజం కోసం వినియోగించే విషయంలో రతన్ టాటా అందరికీ ఆదర్శనీయులని, ఆయన ప్రపంచం గర్వించదగిన వ్యక్తి అని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలు, వినియోగదారుల సేవ శాఖల మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తెనాలి మండలం కంచర్లపాలెం గ్రామంలోని కాటూరి ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శనకు ఏర్పాటు చేసిన రతన్ టాటా విగ్రహాన్ని ఆయన బుధవారం ఆవిష్కరించారు. శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, ఆయన కుమారులు రవిచంద్ర, శ్రీహర్షలను అభినందించారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్నారని వివరించారు. గతంలో జేఆర్‌డీ టాటా విగ్రహాన్ని తాము తయారు చేశామని, దానిని విజయవాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ప్రతిష్ఠించారని, ఇప్పుడు రతన్ టాటా విగ్రహాలను సూరత్, మైసూర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు రూపొందిస్తున్నట్లు శిల్పులు వివరించారు. అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

20న 'రైతు నేస్తం' పురస్కారాల ప్రదానోత్సవం

కొర్నెపాడు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలంలోని కొర్నెపాడు, హైదరాబాద్‌లలో ఉన్న 'రైతు నేస్తం' ఫౌండేషన్ 20వ వార్షికోత్సవం సందర్భంగా పద్మశ్రీ ఐవీ సుబ్బారావు స్మారక పురస్కారాల ప్రదానోత్సవాన్ని ఈ నెల 20న నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ ఛైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. కృష్ణాజిల్లా గన్నవరంలోని స్వర్ణభారతి ట్రస్ట్ వేదికగా జరిగే ఈ కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చేతులు మీదుగా పురస్కారాల ప్రదానం ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన కూడా ఉంటుందని, వ్యవసాయ రంగంలో కృషి చేసిన వారిని గౌరవించుకోవడం ఆనందదాయకమని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విశిష్ట అతిథిగా హాజరయ్యే ఈ కార్యక్రమంలో ముప్పవరపు ఫౌండేషన్ ఛైర్మన్ ముప్పవరపు హర్షవర్ధన్ పాల్గొంటారని వెంకటేశ్వరరావు వివరించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో / కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, రిటైల్ ధర - 157, చికెన్ విత్‌స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 268 చికెన్ స్కిన్‌లెస్ - 278.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 505 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

తెనాలి
•తెనాలి •పొన్నూరు

పొంచి ఉన్న ప్రమాదం


నిడుబ్రోలులో ప్రమాదకరంగా ఉన్న వంతెన

పొన్నూరు, న్యూస్‌టుడే : పొన్నూరు పరిధిలోని నిడుబ్రోలు సాగునీటి కాలువపై నిర్మించిన వంతెన ప్రమాదకరంగా మారింది. వంతెనకు రెండు ప్రక్కల ఏర్పాటు చేసిన కర్రెల రక్షణ పరిరిపోయాయి. వంతెన అడుగుభాగం దెబ్బతింది. అక్కడక్కడ సువ్వలు బయటపడ్డాయి. వంతెన ప్రమాదకరంగా ఉందని అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మానసిక దివ్యాంగులకు విద్యాబోధన


కొల్లిపరలో ప్రదర్శన

కొల్లిపర, న్యూస్‌టుడే : విద్యకు దూరమవుతున్న మానసిక దివ్యాంగ చిన్నారులకు భవిత కేంద్రంలో ప్రత్యేక బోధనా కార్యక్రమాలు నిర్వహిస్తారని ఎంఈఓ సాల్మన్‌రాజు అన్నారు. నిర్దిష్ట అభ్యసనా వైకల్యాలపై మాసోత్సవాల్లో భాగంగా బుధవారం కొల్లిపర భవిత కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. అనంతరం గ్రామంలో ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, భవిత కేంద్రం ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పొన్నూరు 2వ వార్డులో రహదారి పల్లంగా మారింది. వర్షం కురిసినప్పుడల్లా నీరు నిలుస్తోంది. - పి.రమేష్‌బాబు, 2వ వార్డు

✔ మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకుంటా. - అప్సర్, సహాయ ఇంజినీర్

? పొన్నూరు పరిధి రైలుపేటలోని మురుగు కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసన వస్తోంది. - కె. లక్ష్మీకుమారి, రైలుపేట

✔ వ్యర్థాలు తొలగించే విధంగా చర్యలు తీసుకుంటా. - శ్రీనివాసరావు, ప్రజారోగ్యశాఖాధికారి

? తెనాలి పరిధి రామలింగేశ్వరపేట సత్యనారాయణ వీధిలో కుళాయికి ట్యాప్ లేకపోవడంతో తాగునీరు వృథా అవుతుంది. - స్థానికులు, రామలింగేశ్వరపేట

✔ సత్వరమే ట్యాప్ ఏర్పాటు చేయిస్తాం. - వి.శేషన్న, మున్సిపల్ కమిషనర్

స్పందనకు వందనం

➡ తెనాలి ఉడా కాలనీ, ఐతానగర్ అలకుంట వారి రోడ్డులో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం.. మీకుతోడుగా ద్వారా ఈ నెల 15న సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు స్పందించి సమస్యను పరిష్కరించారు.

➡ పొన్నూరు కాపుల్స్‌పేటలో వీధి దీపం బాగు చేయించారు. సాంఖ్యేశ్వరర్ లో పేరుకుపోయిన చెత్త తొలగించారు. - న్యూస్‌టుడే, పొన్నూరు, తెనాలి టౌన్

టీపీఎస్ సునీల్‌కు ఆత్మీయ వీడ్కోలు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: తెనాలి పట్టణ ప్రణాళికా విభాగం నుంచి కందుకూరు మున్సిపాలిటీకి బదిలీపై వెళ్తున్న టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సునీల్‌కు పలువురు అధికారులు, సిబ్బంది సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఏసీపీ సుబ్బారావు, టీపీవో సాంబశివరావు, సిబ్బంది, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: మున్సిపల్ ఏఈగా సూరిబాబు, మెప్మా సిటీ మిషన్ మేనేజర్‌గా విజయకుమారి బాధ్యతలు స్వీకరించినట్లు మున్సిపల్ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వారు గుంటూరు కార్పొరేషన్, రేపల్లె మున్సిపాలిటీ నుంచి బదిలీపై వచ్చారని పేర్కొన్నారు.

మాటలు కాదు.. పైసలు కావాలి

కాలనీలో కొరవడిన వసతులు
ఇబ్బంది పడుతున్న కాలనీ వాసులు

పొన్నూరు, న్యూస్‌టుడే

గత ఐదేళ్ల పాలనలో వైకాపా నాయకులు మాటలతోనే కాలయాపన చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించే ప్రక్రియలో పూర్తిగా విఫలమయ్యారు. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా నిధులు మంజూరు చేసి ఆ సమస్యలను పరిష్కరిస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నారు.

★ జీబీసీ రహదారిలోని తెలగపాలెంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. రాత్రి సమయంలో గుంపులు, గుంపులుగా సంచరిస్తున్నాయి.


27వ వార్డులో అధ్వానంగా రహదారి


తెలగపాలెంలో సంచరిస్తున్న కుక్కలు


29వ వార్డులో ర్యాంపు ఏర్పాటు చేయకపోవడంతో బురదమయంగా రహదారి

ఒంటరిగా తిరగడానికి ఆ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కుక్కలు దాడి చేస్తున్నాయని అనేక సార్లు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు చేపట్టలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు కోతుల సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. తలుపులు తీసి వంట చేయలేని దుస్థితి నెలకొంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

★ పొన్నూరు పట్టణ పరిధి 29వ వార్డు ఓం కాలనీలో మురుగు కాలువపై ర్యాంపు నిర్మాణ పనులకు రెండేళ్ల కిందటే రూ. మూడు లక్షల నిధులు మంజూరు చేశామని అప్పటి వైకాపా నేతలు ప్రకటించారు. ఏళ్లు గడుస్తున్నా పనుల్లో పురోగతి సాధించలేకపోయారు. ఆ మార్గంలో రాకపోకలు నిర్వహించేందుకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. డ్రెయిన్‌లో వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగునీరు రహదారి పైకి చేరి రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందని స్థానికులు వాపోతున్నారు.

★ అబ్దుల్ కలాం రోడ్డులో కొంత భాగం సిమెంటు రహదారులు నిర్మించలేదు. మట్టి రహదారులు కావడంతో వర్షం కురిసినప్పుడల్లా ఆ మార్గంలో ఎవరైనా అడుగు వేయాలంటే అడుసు తొక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని వైకాపా నేతలు ప్రకటించడమే తప్ప పనులు పూర్తి చేయలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రధాన సమస్యలను పరిష్కరించాలని ఆ కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

★ దీనిపై పురపాలక సంఘ డీఈ ఏడుకొండలు 'న్యూస్‌టుడే' తో మాట్లాడారు. సిమెంటు రహదారులు, మురుగు కాలువ నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేశామన్నారు. త్వరలో ఆ పనులు చేపట్టి ప్రజా సమస్యలు పరిష్కరిస్తామన్నారు.


కానుకల లెక్కింపు పర్యవేక్షిస్తున్న ఆలయ ఈవో అనూష, ఛైర్మన్ సాయిబాబు

హుండీ కానుకలు రూ.32.90 లక్షలు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణంలోని వైకుంఠపురంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ. 32,90,502 నగదు, 1.575 కిలోల బంగారం, 81.500 గ్రాముల వెండి సమకూరినట్లు లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ ఈవో వి.అనూష పేర్కొన్నారు. 75 రోజులకుగాను ఈ ఆదాయం లభించినట్లు చెప్పారు. పొన్నూరు వీరాంజనేయస్వామి ఆలయ ఈవో టి. శ్రీనివాస్ పర్యవేక్షకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు ఛైర్మన్ కుంభం సాయిబాబు, సభ్యులు పాల్గొన్నారు.

'నూతన సంస్కరణలతో రైతులకు ఇబ్బందులు'

తాడేపల్లి, న్యూస్‌టుడే: రైతులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెస్తున్న నూతన సంస్కరణలు ఇబ్బందికరంగా ఉన్నాయని రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు అన్నారు. తాడేపల్లి మండలం ఉండవల్లిలో రాజధాని రైతు సంఘం డివిజన్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు.

గ్రామాల ప్రగతే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే ధూళిపాళ్ల

చేబ్రోలు, న్యూస్‌టుడే : ఐదేళ్లుగా గ్రామాల్లో ఆగిపోయిన అభివృద్ధి కార్యక్రమాలు మళ్లీ ప్రారంభం అయ్యాయని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. పల్లె పండగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా బుధవారం చేబ్రోలులో రూ.19 లక్షలు, గొడవర్రులో రూ.5లక్షలు, గుండవరంలో రూ. 3 లక్షలు, నారాకోడూరులో రూ.10 లక్షలు, వడ్లమూడిలో రూ.10 లక్షలతో చేపట్టిన సిమెంటు రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణాలకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు, తెదేపా మండల అధ్యక్షుడు రామరాజు, మండల ప్రత్యేక అధికారి లక్ష్మీకుమారి, ఎంపీడీవో లలిత, ఆయా గ్రామాల కూటమి నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

పొన్నూరు, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తామని తెదేపా గుంటూరు పార్లమెంటు రైతు విభాగం ప్రధాన కార్యదర్శి బొర్రు రామారావు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని పచ్చలతాడిపర్రు, జూపూడి, గోళ్లమూడిపాడు గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమంలో పాల్గొని వివిధ అభివృద్ధి పనులకు కూటమి నేతలు భూమి పూజ చేశారు. ఎంపీడీవో చంద్రశేఖరరావు నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, బండ్లమూడి బాబూరావు, సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.


నారాకోడూరులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్, మార్కండేయబాబు తదితరులు


పచ్చలతాడిపర్రు గ్రామంలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న కూటమి నేతలు

గంజాయి విక్రయ, వినియోగాలను అరికట్టండి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: గంజాయి విక్రయ, వినియోగాలను పూర్తిగా అరికట్టాలని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని స్థానిక శాసనసభ్యుడు, మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. ఆయన పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం రాత్రి డీఎస్పీ బి.జనార్దనరావు, సీఐలు, ఇతర అధికారులతో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న, తహసీల్దార్ గోపాలకృష్ణతోనూ మున్సిపల్, రెవెన్యూ అంశాలపై మాట్లాడారు. పలు సూచనలు చేశారు.


డీఎస్పీ ఇతర అధికారులతో సమావేశమైన మంత్రి మనోహర్

విద్యుత్తు నియంత్రికల తయారీ పరిశీలన

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి ఆటోనగర్‌లోని బీఎస్ఆర్ పవర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో విద్యుత్తు నియంత్రికల తయారీని మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం సాయంత్రం పరిశీలించారు. నిర్వాహక ప్రతినిధుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అర్హులు ఓటు నమోదు చేసుకోవాలి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే : కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదుకు అర్హత కలిగిన ఓటర్లు వచ్చే నెల 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.శేషన్న బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

మెరుగైన ఉపాధికి సాంకేతిక సదస్సులు దోహదం

సంబూరు(పెదకాకాని), న్యూస్‌టుడే : ఇంజినీరింగ్ విద్యార్థుల మెరుగైన ఉపాధి పొందేందుకు జాతీయ స్థాయి సాంకేతిక సదస్సులు దోహదపడతాయని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా ఏపీ స్టేట్ సెంటర్ సెక్రటరీ డాక్టర్ ఎంఎల్ఎస్ దేవకుమార్ తెలిపారు. నంబూరు వీవీఐటీ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో బుధవారం జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు ఎక్స్‌పోషియా 2కె24ను ఆయన ప్రారంభించారు. రెండు రోజుల పాటు ఈ సదస్సులో పలు సాంకేతిక పోటీలు నిర్వహిస్తున్నారు. వివిధ కళాశాలలకు చెందిన 800 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ పి.వి నరేష్ తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ ఎంఎల్ఎస్ దేవకుమార్‌ను సత్కరిస్తున్న వీవీఐటీ ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి తదితరులు

సమస్యలతో సహవాసం..

చెంచుపేటలో ఇదీ పరిస్థితి

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే

పట్టణంలోని చెంచుపేటలో నెలకొన్న సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని చోట్ల ఆక్రమణల కారణంగా రహదారులు కుంచించుకుపోయాయి. ట్రాఫిక్ సమస్యలతో వాహనాలు ముందుకు కదలడం లేదు.

★ గత వైకాపా ప్రభుత్వ హయాంలో చెంచుపేటలో రోడ్ల వెడల్పు చేసేందుకు కాలువల పై ఆక్రమణలు తొలగించారు. కానీ రోడ్ల వేయకపోవడంతో మళ్లీ ఆక్రమణలు వెలిశాయి. అరిటాకుల రహదారి పక్క, రైతు బజార్ అక్కడి నుంచి మారుస్తామని చెప్పినా అడుగు ముందుకు పడలేదు. వినియోగదారులు తమ వాహనాలను రోడ్డు పైన నిలుపుతుండడంతో ఇటుగా రాకపోకలు సాగించే వారు ఇబ్బంది పడుతున్నారు.


చెంచుపేట విజయప్రసాద్ రోడ్డులో గోడలు నిర్మించక పంటకాలువలో కలుస్తున్న మురుగునీరు, వ్యర్థాలు



ఆర్టీసీ బస్‌షెల్టర్ లేక రోడ్డుపై వేచి ఉన్న ప్రయాణికులు

★ చెంచుపేటలోని గుంటూరు-తెనాలి ఆర్ అండ్ బీ రోడ్డు పక్క ఆర్టీసీ ప్రయాణికుల కోసం బస్ షెల్టర్ లేకపోవడంతో, వానలో నిలబడలేక ఇబ్బంది పడుతున్నట్లు వృద్ధులు, దివ్యాంగులు వాపోతున్నారు.

కేఎన్ఎస్ స్కూల్ రోడ్డులో గుంతల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

★ రత్నశ్రీ పబ్లిక్‌స్కూల్ రోడ్డులోని పంట కాలువకు రెండు వైపులా గోడలు నిర్మించి పైకప్పు వేయకుండా వదిలేశారు. జనం అందులో వ్యర్థాలు వేస్తున్నారు. మురుగునీరు పంటకాలువలో కలిసి కలుషితమవుతుంది. డొంక రోడ్డులో పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ గాలికొదిలేశారు. చెంచుపేటలో ఇంటింటికీ కుళాయిలు బిగించేందుకు పైప్‌లైన్లు వేయించారు. కుళాయిలు బిగించాలని చెంచుపేట వాసులు కోరినా బిగించలేదని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారానికి ఒక రోజు కూడా కాలువలు శుభ్రం చేయట్లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


★ చెంచుపేట ప్రధాన రహదారి, మున్సిపాలిటీ కాలువలపై ఆక్రమణలు వెలిశాయి. విద్యార్థుల రాకపోకల సమయంలో వాహనాలు ఎక్కువ. డివైడర్ల నిర్మాణం లేక అసాధ్యంగా ఉంటుంది. ఈ రద్దీని నియంత్రించిన వారు లేరు. మున్సిపల్ అధికారులు విద్యుత్తు తీగల కింద పెట్టించిన మొక్కలు చెట్లుగా ఎదిగాయి. ఇవి విద్యుత్తు తీగలకు అడ్డుగా రావటంతో వాటి కొమ్మలు నరికించడం పరిపాటి అయింది. మురుగు నీరు పంట కాలువల్లో కలవడంతో పత్యమ్మాయ ఏర్పాట్లు చేయాలి.
- టి.వి. చలపతిరావు, ఎన్‌వో, చెంచుపేట


★ చెంచుపేటలోని ప్రధాన రహదారి పై స్పీడ్ బ్రేకర్ల వల్ల వాహనాల అదుపు బాగాలు దెబ్బతింటున్నాయి. ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటి ఎత్తు తగ్గించాలి. పక్కా కాలువలు పూడిపోయి దెబ్బతిన్నాయి. మాదల వారి వీధిలో స్థానికులకు తాగునీటి కుళాయిలు ఇవ్వట్లేదు. వీధి కుక్కలు పెరిగిపోయాయి. ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు బయటకెళ్లే మార్గం లేక దోమల, పాముల బెడద ఎక్కువ అయింది.
- కోగంటి వెంకటేశ్వరరావు, చెంచుపేట

చూశారు.. చేశారు

పొన్నూరు, న్యూస్‌టుడే :


నిడుబ్రోలు మంచినీటి పథకం వద్ద పని చేస్తున్న క్యారిఫ్లోక్యులేటర్

పొన్నూరు పరిధి నిడుబ్రోలు రక్షిత నీటి పథకం వద్ద మంచి నీటిని శుద్ధి చేసే క్యారిఫ్లోక్యులేటర్ పరికరం పాడైపోయింది. దీంతో నీటి శుద్ధి జరగడం లేదని పుర ప్రజలు ఆందోళన చెందుతున్నారని 'ఇంకెప్పుడు చేస్తారు', 'నిధులున్నా...మరమ్మతులు కరువు' అనే పలు కథనాలు 'ఈనాడు'లో ప్రచురితమయ్యాయి. ఇందుకు పురపాలక సంఘ అధికారులు స్పందించారు. పాడైపోయిన పరికరం బాగు చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు రూ. 26 లక్షల నిధులు మంజూరు చేసి క్యారిఫ్లోక్యులేటర్ పరికరాన్ని బాగు చేయించారు. ఆ పరికరం అందుబాటులోకి రావడంతో నీటి శుద్ధి ప్రమాణాలకు అనుగుణంగా జరుగుతోందని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు.

స్పందనకు వందనం

ప్రకృతి సాగు పంటలతో మేలు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయం కష్టంతో కూడుకున్నది..దానిని ఇష్టంగా ముందుకు తీసుకెళ్లాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. జిల్లా కలెక్టర్ బంగ్లారోడ్డులోని కృషిభవన్‌లో బుధవారం మహిళా రైతు దినోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రసాయన రహిత ఆహారం తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకునేవారే మరింత మంది మహిళలకు తెలియజేయాలన్నారు. అనంతరం మహిళా రైతు తోట విజయలక్ష్మిని సన్మానించారు.

27న విశ్వవిద్యాలయాల విద్యార్థుల సమ్మేళనం

ఏ.ఎన్.యు., న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 27, 28 తేదీల్లో విశ్వవిద్యాలయాల సమ్మేళనం నిర్వహించనున్నట్లు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాయకులు పవన్‌కుమార్ చెప్పారు. సమ్మేళనం కరపత్రాన్ని రెక్టార్ ఆచార్య రత్నశీల మణి బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ ఈ రెండురోజుల సమ్మేళనానికి ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ విధానంపై చర్చిస్తామన్నారు.


బ్రోచర్ ఆవిష్కరించిన రెక్టార్ ఆచార్య రత్నశీలామణి, ఏబీవీపీ నాయకులు

ఏఎన్‌యూలో ఫార్మసీ పరీక్షలు ప్రారంభం

ఏ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బుధవారం నుంచి ఎం ఫార్మసీ, బీ ఫార్మసీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఏఎన్‌యూలోని పరీక్షా కేంద్రాన్ని వీసీ పరీక్షల సమన్వయకర్త ఆచార్య సుబ్బారావు పరిశీలించారు. విద్యార్థుల హాల్‌టిక్కెట్లను తనిఖీ చేశారు. పరీక్షలు సజావుగా సాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షలు సజావుగా సాగేందుకు ప్రత్యేక పరిశీలకులను నియమించామన్నారు.

సంప్రదాయ వంటలపై అవగాహన ఉండాలి

పొన్నూరు, న్యూస్‌టుడే : సంప్రదాయ వంటలపై మహిళలకు అవగాహన ఉండాలని తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ జనరల్ మేనేజర్ పాలిశెట్టి కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే మంచి ఆహారం, వ్యాయామం, నిద్ర అవసరమన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ శ్రద్ధగా చదువుకునే విద్యార్థులు జీవితంలో ఏ అవకాశాన్నయినా అందిపుచ్చుకోగలరని తెలిపారు. కార్యక్రమంలో ఉపకులపతి పి.నాగభూషణ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాలిశెట్టి కృష్ణప్రసాద్

ఐటీఏ ఉద్యోగుల సంఘ జిల్లా కమిటీ ఎంపిక

తెనాలి టౌన్, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఐటీఏ, డీఎల్‌టీసీఎస్ ఉద్యోగుల సంఘం, గుంటూరు జిల్లా కమిటీ ఎంపిక తెనాలి ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో బుధవారం ఏకగ్రీవంగా జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా రావి చిరంజీవి, కార్యదర్శిగా బాబూరావు, కోశాధికారిగా నైక్.మాలిక్, ఉపాధ్యక్షులుగా శేఖర్‌బాబు, బాలాజీ, సంయుక్త కార్యదర్శులుగా వెంకటేశ్వరరావు, విజయప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా ప్రకాష్‌బాబు, శివప్రసాదరావు, శ్రీనివాసరావు, పద్మజ ఎంపికయ్యారు. ఎన్నికల అధికారిగా భీమారావు, సహాయ ఎన్నికల అధికారిగా రమేష్‌బాబు, పరిశీలకులుగా డి.శ్రీనివాస్ వ్యవహరించారు.


నూతన కమిటీ సభ్యులు

పోలీసులకు చిక్కిన అంతర జిల్లాల కేటుగాళ్లు

కడియం, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా కడియం మండలంలోని కడియపులంక గ్రామంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన చోరీ ఉదంతాన్ని పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. ఇన్‌ఛార్జి డీఎస్పీ కె.రమేష్‌బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జూన్ 18 2024న రాత్రి కడియపులంక గ్రామానికి చెందిన కర్రి వెంకటేశ్వరరావు నివాసంలో చోరీ జరిగింది. ఈఘటనలో 108 గ్రాముల బంగారు ఆభరణాలు, మూడు కేజీల వెండి వస్తువులు లాకరులో ఉంచిన రూ.1.08 లక్షల నగదు గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి చోరీ చేసినట్లు బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం ఉదయం కడియం సీఐ వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం సీసీఎస్ సీఐ వై. రాంబాబు సిబ్బందితో కలిసి కడియపులంకలో చోరీ కేసుగ్రస్త అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా గుంటూరు జిల్లా తెనాలి మండలం నందివెలుగు గ్రామానికి చెందిన పిల్లి సురేష్ అలియాస్ శివ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం తాతపూడి గ్రామానికి చెందిన కలసాని శ్రావణకృష్ణ అలియాస్ శ్రవణ్‌లుగా గుర్తించారు. దర్యాప్తులో వీరిద్దరూ అనేక నేరాలకు పాల్పడినట్లు రుజువైంది. వీరి చేసిన చోరీలకు సంబంధించి వెండి, బంగారు వస్తువులను మాయో వ్యక్తికి ఉన్న అనపర్తి మండలం కుతుకులూరు గ్రామానికి చెందిన పోతంశెట్టి గోపాలకృష్ణ అలియాస్ రెడ్డి వద్ద దాచేవారు. పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండలో రెండు చోరీలు, ప్రకాశం జిల్లా దర్శి, బాపట్ల జిల్లా చందోలులో ఒక్కొక్కటి చొప్పున చోరీలకు పాల్పడినట్లు విచారణలో నేరాన్ని అంగీకరించారు. కడియం పోలీసు స్టేషన్ పరిధిలో చోరీ గురైన వస్తువులతోపాటు పెనుగొండ, దర్శి తదితర ప్రాంతాల్లో చోరీ చేసిన బంగారం వస్తువులు 16.738 కాసులు(129 గ్రాములు), 7.8 కేజీల వెండి వస్తువులను వీరి నుంచి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రిమాండుకు తరలించామని డీఎస్పీ తెలిపారు. ఈ కేసు ఛేదనలో కీలక పాత్ర పోషించిన కడియం సీఐ వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం సీసీఎస్ సీఐ వై. రాంబాబు సిబ్బందిని జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ అభినందించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: దుగ్గిరాల మండలానికి చెందిన గణేష్ తెనాలి బస్టాండ్ సమీపంలో బుధవారం సాయంత్రం ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం చేశారు. స్థానికులు ఆయన్ను తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అత్యాచార కేసులో నిందితుడి అరెస్ట్

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: సహజీవనం చేసిన వ్యక్తి తనను మోసగించాడని పట్టణానికి చెందిన ఓ మహిళ కొద్ది రోజుల కిందట వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అత్యాచారం కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు కె.శ్యాంసన్‌ను బుధవారం అరెస్టు చేశారు.

రామలింగేశ్వరపేటలో ఇంట్లో చోరీ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి పరిధి రామలింగేశ్వరంపేటలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. బంగారు ఉంగరాలు, రుద్రాక్ష మాల, ఇత్తడి వస్తువులు చోరీకి గురైనట్లు బాధితులు వన్‌టౌన్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

వార్డు సచివాలయ ప్రాంగణంలో అసాంఘిక కార్యక్రమాలు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: తెనాలి పరిధి చినరావూరు సీలింగ్ కట్ట కూలిన వార్డు సచివాలయ ప్రాంగణంలో అసాంఘిక కార్యక్రమాలు నడుస్తున్నట్లు స్థానికులు బుధవారం తెలిపారు. వారిపై ఫిర్యాదు చేస్తే ఇబ్బంది పెడతారేమోనని భయంతో చూసి చూడనట్లు ఉంటున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఒకసారి ఈ సచివాలయంలో దొంగలు పడినట్లు తెలిపారు. ఈ విధానాలను సచివాలయ ఉద్యోగులు బయటకు పొక్కనీయకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం.

శతాధిక వృద్ధుడి మృతి

కొల్లిపర, న్యూస్‌టుడే : శతాధిక వృద్ధుడు ఆళ్ల శేషిరెడ్డి (104) బుధవారం కన్నుమూశారు. మున్నంగి గ్రామానికి చెందిన ఆయన గతేడాది 103వ పుట్టిన రోజు వేడుకలను బంధుమిత్రులతో ఆనందంగా జరుపుకొన్నారు. ఆయన గ్రామ మునసబుగా సేవలందించారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

'నూతన సంస్కరణలతో రైతులకు ఇబ్బందులు'

తాడేపల్లి, న్యూస్‌టుడే: రైతులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెస్తున్న నూతన సంస్కరణలు ఇబ్బందికరంగా ఉన్నాయని రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు అన్నారు. తాడేపల్లి మండలం ఉండవల్లిలో రాజధాని రైతు సంఘం డివిజన్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22న విజయవాడలో వ్యవసాయ రంగ సమస్యలపై రాష్ట్ర స్థాయి సదస్సు ఉంటుందని, కేరళలో వామపక్ష ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు అనుకూల విధానాలు, మద్దతు ధరల చట్టం ఆవశ్యక తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. రైతు సంఘం రాజధాని అధ్యక్షుడు జగదీశ్వరరెడ్డి, నాగేశ్వరరావు, వీరవెంకయ్య, భక్తిరెడ్డి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

బాధ్యతల స్వీకరణ

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పెదనందిపాడు మండల సర్వేయర్‌గా బుధవారం టి.శ్రీనివాసరావు ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈయన గుంటూరు ఏడీ కార్యాలయం నుంచి బదిలీ పై వచ్చారు. ఇక్కడ సర్వేయర్ పని చేస్తున్న ప్రసాద్ చిలకలూరిపేటకి బదిలీ అయ్యారు.

జోరు వర్షం

ప్రత్తిపాడు, పెదనందిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు మండలంలో బుధవారం జోరున వర్షం కురిసింది. ఉదయం కొంత సమయం ఎండ వచ్చినా మధ్యాహ్నం ఒక్కసారిగా మేఘాలు కమ్ముకుని వచ్చి ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ప్రధాన రహదారులపై నీరు నిలిచి రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షానికి పత్తి కాయలు, మిర్చి మొక్కలు దెబ్బతింటాయని రైతులు ఆవేదనతో ఉన్నారు.

సమస్యలు పరిష్కరించరూ..!

మేడికొండూరు: మేడికొండూరు మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం జరిగింది. వైకాపా జడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న పల్లె పండుగ(పంచాయతీ వారోత్సవాల)లో ప్రోటోకాల్ పాటించడం లేదని స్థానిక ప్రజా ప్రతినిధులకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని సభ దృష్టికి తెచ్చారు. పేరేచర్ల సర్పంచి కొరిటాల రాజకుమార్ స్పందిస్తూ.. గ్రామంలో కొన్నాళ్ల కిందట కైలాసగిరి క్షేత్రం కొండపైకి ఘాట్ రోడ్డు వేశారు. సంబంధిత శిలాఫలకం పై సర్పంచి పేరు ఎందుకు రాయలేదని ప్రశ్నించారు. ఎంపీపీ చందన మాట్లాడుతూ ముందుగా ప్రభుత్వ కార్యక్రమం ఏది జరిగినా ప్రోటోకాల్ పాటిస్తామని స్పష్టం చేశారు. వివిధ శాఖల అధికారులు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. సభ్యులు మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

? తాడికొండ వేణుగోపాలస్వామి ఆలయంలో వరాహాల సంచారంతో భక్తులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. -జనార్దన్, పూజారి.

✔ ఆ ప్రాంగణంలో పందులు సంచరించకుండా తగు చర్యలు తీసుకుంటాం. పెంపకందారులకు కౌన్సెలింగ్ ఇస్తాం. -హరిబాబు, పంచాయతీ కార్యదర్శి

స్పందనకు వందనం

తుళ్లూరు, న్యూస్‌టుడే: అనంతవరంలో తాగు నీటి ట్యాంకు పైకి పెరిగిన చింత చెట్టు కొమ్మలను తొలగించాలని 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షిక 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. కార్యదర్శి ఆదినారాయణ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు కొమ్మలను తొలగించారు.

ప్రత్తిపాడు: గ్రామ పంచాయతీ దగ్గర దుకాణాల వద్ద వర్షపు నీరు భారీగా నిలిచాయి. స్థానికులు ఈ సమస్యను మేమున్నాం.. మీకు తోడుగాను తెలియజేశారు. ప్రత్తిపాడు పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి షేక్ ఖాజాకు సమస్యను చెప్పడంతో వెంటనే పారిశుద్ధ్య కార్మికులతో నీరు కాల్వల్లోకి వెళ్లేలా దారిని ఏర్పాటు చేయించారు. - న్యూస్‌టుడే, ప్రత్తిపాడు

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరిలోని ఇప్పటం రోడ్డు, ఇందిరానగర్, ఎలీవ్ నగర్, ఏపీఎస్పీ బెటాలియన్ గేటురోడ్డు, ద్వారకానగర్ ప్రాంతాల్లో గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ డీఈఈ సురేష్‌బాబు బుధవారం రాత్రి విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. 33కేవీ విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

సమస్యలు చెప్పుకొందామంటే వినేవారేరీ..?

ప్రతి పనికీ మంగళగిరి వెళ్లాల్సిన వైనం

తాడేపల్లి, న్యూస్‌టుడే: ఏదైనా సమస్య చెప్పుకుందామంటే కనీసం వినేవారు లేకుండా పోయారంటూ తాడేపల్లి వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాడేపల్లి పట్టణం, మండలంలోని గ్రామాలను విలీనం చేసి మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థగా ఏర్పాటు చేశారు. ఆ తరువాత తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక తాడేపల్లి అర్బన్, గ్రామీణ ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉన్న శాఖలన్నీ మంగళగిరిలోని నగరపాలక కార్యాలయానికి తరలించారు. ఇక్కడ ఉండేవారికి ఏదైనా సమస్య తలెత్తితే మంగళగిరి పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పురపాలక సంఘంగా ఉన్నప్పుడు ఎంతో సౌలభ్యంగా ఉండేది, ఇక్కడ కూడా కొంత పరిపాలనా అధికారులను నియమించి చాలని నగర పౌరులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం విభాగాలన్నీ మంగళగిరి తరలించడంతో దాదాపు రూ.2 కోట్లు వెచ్చించి నిర్మించిన తాడేపల్లి పురపాలక కార్యాలయం ఖాళీగా దర్శనమిస్తోంది. 2021లో నగరపాలక సంస్థ ఏర్పడిన తరువాత నగరాన్ని రెండు జోన్లుగా విభజిస్తామన్నారు. కానీ ఆచరణలో మాత్రం అమలుకు నోచుకోలేదు. ఫలితంగా తాడేపల్లి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.


తాడేపల్లిలో పురపాలక భవనం

దూరాభారం..

ఏదైనా సమస్య సచివాలయాల్లో చెబితే ఇక్కడేమీ లేదు మంగళగిరి వెళ్లమని చెబుతున్నారు. దీంతో వ్యయ ప్రయాసలకోర్చి తీరా ఎవరూ సమస్యను వివరించినా లేదని చెబుతున్నారు. లక్ష జనాభా కలిగిన తాడేపల్లిలో ప్రతి పనికీ మంగళగిరి వెళ్లాలంటే సాధ్యం కాలేదని వాపోతున్నారు. మెప్మా, రెవెన్యూ విభాగం తాడేపల్లి పురపాలక సంఘ కార్యాలయంలో పనిచేస్తున్నాయి. అయినా రెవెన్యూ సంబంధించి అర్జీ ఇవ్వాలంటే మంగళగిరి వెళ్లాల్సిందేనని వాపోతున్నారు. ఈ పరిస్థితిలో పౌరులకు సమయం వృథా కావడమే కాకుండా ఆర్థిక భారం పడుతుందని వాపోతున్నారు.

సమస్యలు వింటూ..భరోసా ఇస్తూ..

తాడేపల్లి, న్యూస్‌టుడే: విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ ప్రజల్ని నేరుగా కలుసుకుని వారి సమస్యలను తెలుసుకుంటూ భరోసా ఇచ్చారు. తాడేపల్లి మండలం ఉండవల్లి నివాసంలో బుధవారం 42వ రోజు ప్రజా దర్బార్ నిర్వహించారు. మంగళగిరి నియోజకవర్గం నుంచి ప్రజలు మంత్రిని కలిసి వినతిపత్రాలను అందజేశారు. వాటికి త్వరితగతిన పరిష్కారం చూపాలని సంబంధిత శాఖల అధికారులకు మంత్రి ఆదేశించారు. గత ప్రభుత్వం నిలిపివేసిన రైతుకూలీ పింఛన్ తిరిగి ఇప్పించాలని మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామానికి చెందిన రమాదేవి, పక్షవాతంతో బాధపడుతున్న తనకు పింఛన్ మంజూరు చేయాలని తాడేపల్లి మండలం కుంచనపల్లి గ్రామానికి చెందిన కృపారావు విన్నవించారు. * అనారోగ్యంతో బాధపడుతున్న తనకు ఎలాంటి ఆధారం లేదని ఆర్థికసాయం చేయాలని దుగ్గిరాల మండలం రేవేంద్రపాడుకు చెందిన సాంబశివరావు వినతి అందజేశారు.


మంత్రి లోకేశ్‌కు సమస్య వివరిస్తున్న దివ్యాంగుడు

నేడు..

తాడేపల్లి, న్యూస్‌టుడే: ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి, మంగళగిరి శాసనసభ్యులు నారా లోకేశ్ మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు గురువారం అందుబాటులో ఉంటారు. ఉదయం 6 నుంచి 7 గంటల మధ్య నిర్వహించే 'ప్రజా దర్బార్'లో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఏడు గంటల్లోపు వచ్చే వారికే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

కేంద్ర అధికారుల తనిఖీ

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పెదనందిపాడు, పుసులూరులో కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు అవుతున్న తీరును కేంద్ర ప్రభుత్వ అధికారులు సురేంద్రనాథ్, అశోక్ సాహులు బుధవారం ఆయా సచివాలయాల్లో తనిఖీ చేశారు. 2022-23, 2023-24 ఉపాధి హామీ పనులకు సంబంధించి దస్త్రాలను పరిశీలించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద గృహ నిర్మాణాలు అందుకు సంబంధించిన బిల్లులు చెల్లింపుపై ఆరా తీశారు. సామాజిక పింఛన్లు సక్రమంగా అందుతున్నాయా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు.

సంక్రాంతి కల్లా రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలి

తాడికొండ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా బుధవారం తాడికొండ మండలం మోతడక గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణం భూమి పూజలో గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.నాగలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్‌తో కలిసి ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో రూ.75 లక్షల నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. రాబోయే రెండు, మూడు నెలల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సంక్రాతి పండగకు గ్రామాలలో సీసీరోడ్లను ప్రజలకు అందుబాటులో ఉంచే విధంగా అధికార యంత్రాంగం పనిచేస్తోందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తాడికొండ మండల సమస్యలను గత వైకాపా ప్రభుత్వం నిరక్ష్యం చేసిందని, కూటమి ప్రభుత్వం ఇందుకు భిన్నంగా అభివృద్ధిపై దృష్టిసారించిందన్నారు. తహసీల్దారు నాసరయ్య, ఎంపీడీవో సమతావాణి, ఏపీఎం సాంబశివరావు, తెదేపా మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్న కుమార్, కంచెర్ల శివరామయ్య, తెదేపా జిల్లా అధికార ప్రతినిధి గుంటుపల్లి మధుసూదనరావు, నాయకులు యడ్లపల్లి సాంబశివరావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.


మోతడకలో భూమి పూజ చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్


వింజనంపాడులో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బూర్లరామాంజనేయులు.

అభివృద్ధికి ముందడుగు

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: వట్టిచెరుకూరు మండలంలోని కొర్నెపాడు, వింజనంపాడు గ్రామాలలో పల్లె పండగలో భాగంగా రూ.20లక్షల వ్యయంతో నిర్మించనున్న రెండు అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు బుధవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఈ రోడ్ల నిర్మాణాలు కేవలం మూడు నెలల్లోనే పనులు పూర్తి చేస్తామని వివరించారు. జిల్లా డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, ఇన్‌ఛార్జి సర్పంచి ఎన్.సాంబశివరావు, ఎంపీటీసీ యూ.సుజాత తదితరులు హాజరయ్యారు.

నేడు ఎక్కడెక్కడంటే..

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఫిరంగిపురం మండలంలో గురువారం నిర్వహించే 'పల్లె పండగ' (పంచాయతీ వారోత్సవాలు) కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ పాల్గొంటారని తెదేపా మండలాధ్యక్షుడు మండవ చిన్ననరసింహరావు తెలిపారు. వేములూరిపాడు, ఫిరంగిపురం, కండ్రిక, యర్రగుంట్లపాడులో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేస్తారని చెప్పారు.

సౌకర్యాల కల్పనకు అధిక ప్రాధాన్యం

మోరంపూడి(దుగ్గిరాల), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా నడుస్తున్నాయని మండల పరిషత్తు ఉపాధ్యక్షురాలు పసుపులేటి సాయిచైతన్య, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత అన్నారు. మోరంపూడి, పేరకలపూడిలలో బుధవారం పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాల కార్యక్రమం ఎంపీడీవో అడిగొప్పుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మోరంపూడి సర్పంచి ఇత్తడి రమేష్, పేరకలపూడి ఎంపీటీసీ సభ్యుడు తాళ్ల అశోక్ పర్యవేక్షణలో జరిగాయి. రెండు గ్రామాల్లో రూ. 45 లక్షలతో పది పనులకు శంకుస్థాపన చేశారు. ఈవోపీఆర్డీ జవహర్‌లాల్‌నెహ్రూ, నరేగా ఏపీఎం మధుబాల, కార్యదర్శులు నరేంద్ర, శ్రీనివాసరావు, కూటమి నాయకులు ఉన్నారు.


పేరకలపూడిలో శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పంట నష్ట పరిహారం పంపిణీపై విచారణ

మేడికొండూరు, న్యూస్‌టుడే: పంట నష్ట పరిహారం సొమ్ము పంపిణీ విషయంలో నిగ్గు తేల్చేందుకు అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. గుంటూరు ఇన్‌ఛార్జి ఏడీఏ తిరుమలాదేవి ఆధ్వర్యంలో 15 మంది మూడు బృందాలుగా ఏర్పడి యలవర్తిపాడు, సిరిపురం, పాలడుగు, వరగానిలో పర్యటించారు. అర్హుల జాబితా ఆధారంగా చేసుకుని ఒక్కో రైతుతో స్వయంగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కొద్ది రోజుల కిందట మేడికొండూరు మండలం పరిధిలో వానలకు, వరదలకు పంట నష్టం కలిగింది. మొత్తం 8 గ్రామాల్లో పత్తి పంట దెబ్బతింది. 220 హెక్టార్లో పంట పాడైపోయిందని అధికారులు 350 మంది రైతుల పేర్లు జాబితాలో చేర్చారు. దీన్ని ఆధారంగా చేసుకుని ప్రభుత్వం రూ.37.5లక్షలు పరిహారం సొమ్ము విడుదల చేసింది. డబ్బులు నేరుగా రైతుల వ్యక్తి గత బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి. ఈ క్రమంలో యలవర్తిపాడు, మేడికొండూరు పరిధిలో పంట నష్ట పరిహారం సొమ్ము అక్రమం జరిగిందని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ కలగజేసుకుని కలెక్టర్ నాగలక్ష్మితో మాట్లాడారు. పరిహారం లబ్ధి విషయంలో నిగ్గు తేల్చాలని ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు విచారణ ప్రారంభించారు. గురువారం మేడికొండూరు, కొర్రపాడు, పొట్లపాడు, మందపాడులో విచారణ జరగనుంది. పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరీ, గుంటూరు ఎస్టీఎల్ అన్నపూర్ణ, బీసీఎల్ సునీత సూపర్‌వైజర్లుగా వ్యవహరించారు. గుంటూరు, మేడికొండూరు, ఫిరంగిపురం ఏవోలు సుబ్రహ్మణ్యం, నాగరాజు, వాసంతి, ఆయా గ్రామ రెవెన్యూ అధికారులు, సహాయకులు, వ్యవసాయ శాఖ సిబ్బంది విచారణ కమిటీ సభ్యులుగా ఉన్నారు.


యలవర్తిపాడులో విచారణ చేస్తున్న అధికారులు

పిడుగుపాటుకు దెబ్బతిన్న భవనం

గుంటూరు రూరల్, దుగ్గిరాల, న్యూస్‌టుడే: గుంటూరు రూరల్ మండలం గొర్లవారిపాలెం గ్రామంలో బుధవారం పిడుగు పడడంతో ఎర్రాకుల శ్రీనివాసరావుకు చెందిన భవనం పాక్షికంగా ధ్వంసం అయింది. బుధవారం సాయంత్రం ఉరుములు వచ్చిన సమయంలో గొర్లవారిపాలెంలో శ్రీనివాసరావు భవనంపై పిడుగు పడడంతో గోడలు బీటలు వారాయి. భారీ శబ్దం దాటికి ప్రాణాలు గాలిలో కలిసినంత పనైందని శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. దుగ్గిరాల సినిమా హాలు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌పై బుధవారం సాయంత్రం పిడుగుపడింది. ఈ ప్రభావం వల్ల ఆ ట్రాన్స్‌ఫార్మర్ కింద విద్యుత్తు ప్రవాహం ఉండే రెండు వీధుల్లో సరఫరా ఆగిపోయింది. డిస్కం సిబ్బంది మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించారు.


కూలిన గోడ

వానొస్తే.. బడికి వెళ్లేదెట్టా..?


నాగులపాడులో చప్టాపై నిలిచిన వాన నీటిలోంచి పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు

పెదనందిపాడు, న్యూస్‌టుడే: వర్షం కురిస్తే పాఠశాలలకు వెళ్లాలంటే విద్యార్థులకు ఇబ్బందే. నాగులపాడు ప్రాథమి పాఠశాలకు వెళ్లే విద్యార్థులు సప్టాపై వర్షపు నీటిలో దిగాల్సిందే. వర్షం వచ్చిన రోజు తల్లిదండ్రులు వచ్చి పిల్లలను వదిలి వెళుతున్నారు. మరి కొందరు విద్యార్థులు చప్టా నీటిలో దిగి ఒకరినొకరు పట్టుకుని బిక్కుబిక్కుంటూ పాఠశాలకు చేరుతున్నారు. బడి ఆవరణలోనూ వర్షపు నీరు నిలుస్తోంది. ఇక్కడ తూములు ఏర్పాటు చేసి కాజ్‌వే నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. గత ప్రభుత్వంలో అధికారులు తమ సమస్యను పట్టించుకోలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బురదలో దిగాల్సిందే..

ఉప్పలపాడులోని జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులు వానా కాలంలో యాతన పడుతున్నారు. సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో బురదలో దిగి రాకపోకలు సాగిస్తున్నారు. కొన్నేళ్ల నుంచి సమస్య ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెబుతున్నారు.


ఉప్పలపాడులో బురదమయంగా మారిన రహదారిపై..

సమస్యలు పరిష్కరిస్తాం..

ఉప్పలపాడు పాఠశాలలకు వెళ్లే రహదారి నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేసి నిర్మాణం చేపడతాం. నాగులపాడు చప్టాకు మరమ్మతులు చేయించి విద్యార్థుల ఇబ్బందులు తొలగిస్తాం.

-శ్రీలక్ష్మి, ఎంపీడీవో, పెదనందిపాడు

ఏసీసీ కార్మికులను ఆదుకోండి

తాడేపల్లి, న్యూస్‌టుడే: తాడేపల్లి పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ కార్మికులు ఖాళీ కంచాలతో బుధవారం నిరసన తెలిపారు. ర్యాలీగా మండల రెవెన్యూ కార్యాలయానికి చేరుకుని ధర్నా నిర్వహించారు. సిమెంటు కార్మికుల విషయంలో ఏసీసీ, ఎన్నారైల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నాయకులు ఆరోపించారు. కార్మిక కుటుంబాలను ఆదుకునేందుకు మంత్రి లోకేశ్ చొరవ తీసుకోవాలని, తగిన నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. ఆ సంఘం నాయకులు స్టీవెన్, ఆదినారాయణ, వేముల దుర్గారావు, సీఐటీయూ నాయకులు నేతాజీ, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొని తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మండల రెవెన్యూ అధికారులకు అందజేశారు.


రెవెన్యూ కార్యాలయం ఎదుట కార్మికులు, నాయకుల నిరసన

కార్యాలయంలో వంట.. ఆదమరిస్తే మంట

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పెదనందిపాడు తహసీల్దార్ కార్యాలయంలో వంట చేసే కార్యక్రమానికి ఉపక్రమించారు. కార్యాలయ సిబ్బంది మధ్యాహ్నం భోజనానికి క్యారేజీ తెచ్చుకోవడం, తెప్పించుకోవడం సాధారణంగా జరిగే ప్రక్రియ. ఈ విధంగా సర్వేయర్లు ఉండే గదిలో గ్యాస్‌తో వంట కార్యక్రమం నిర్వహించడం విమర్శలకు తావిచ్చింది. ఏ చిన్నపాటి పొరపాటు జరిగిన పక్కనే ఉన్న దస్త్రాలు, కాగితాలు మంటల్లో కాలిపోయే అవకాశం ఉంది. ఈ పరిస్థితిని చూసి స్థానికులు తహసీల్దార్ కార్యాలయంలో వంట చేయడం ఏమిటని ముక్కుమీద వేళ్లు వేసుకుంటున్నారు. బుధవారం విధుల్లో చేరిన మండల సర్వేయర్ తన గదిలో వంట ఏర్పాటు చూసి అవాక్కయ్యారు. ఈ విషయంపై సిబ్బందిని వివరణ అడగ్గా వంట ఏర్పాటు కార్యక్రమాన్ని తీసి వేస్తామని పేర్కొన్నారు.


పెదనందిపాడు: తహసీల్దార్ కార్యాలయంలో ఇలా...

లారీ టైరు కింద పడి యువకుడి మృతి

రహదారి పక్కన నిద్రిస్తుండగా ఘటన

క్రైం కార్నర్

టి.నరసాపురం, న్యూస్‌టుడే: రహదారి పక్కన నిద్రిస్తున్న వ్యక్తిపై నుంచి లారీ వెళ్లడంతో మృతిచెందిన సంఘటన ఏలూరు జిల్లా టి.నరసాపురంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం పెదపరిమికి చెందిన కావూరి దినేశ్‌బాబు(26) వేడుకలకు అలంకరణ పనులు చేస్తుంటాడు. ఒప్పుకొన్న పనుల నిమిత్తం మరి కొందరితో కలిసి మంగళవారం రాత్రి టి.నరసాపురం వచ్చారు. అందరూ కలిసి రహదారిపై ఆగి ఉన్న లారీ పక్కనే నిద్రకు ఉపక్రమించారు. బుధవారం ఉదయం దినేశ్‌బాబు నిద్రిస్తుండగా.. మిగిలిన వారంతా కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు వెళ్లారు. ఆ విషయాన్ని గమనించని లారీ చోదకుడు వాహనాన్ని నడపటంతో టైరు దినేశ్‌బాబు తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు ప్రకాశ్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, శవాన్ని పరీక్ష నిమిత్తం చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఏఎస్సై జయకుమార్ తెలిపారు

టిప్పరు ఢీకొని ద్విచక్ర వాహనదారుడు..

తాడేపల్లి, న్యూస్‌టుడే: తాడేపల్లి మండలం వడ్డేశ్వరం వద్ద ద్విచక్ర వాహనాన్ని టిప్పరు ఢీకొన్న ఘటనలో తాడికొండ మండలానికి చెందిన మస్తాన్‌వలి(56) అనే వ్యక్తి మృతిచెందినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. ఈనెల 15వ తేదీ రాత్రి ద్విచక్ర వాహనంపై తాడికొండ వెళ్లేందుకు జాతీయ రహదారిపై వస్తుండగా ఈ ఘటన జరిగింది. క్షతగాత్రుడిని 108 వాహనంలో తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. భార్య షంషాద్‌బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

లేమల్లెపాడు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: దీర్ఘకాలికంగా ఉంటున్న అనారోగ్యాన్ని భరించలేక ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం వట్టిచెరుకూరు మండలంలోని లేమల్లెపాడు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై ఎం.సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తోకల అరుణ(60)అనారోగ్యంతో బాధపడుతున్నారు. దాని నుంచి కోలుకోడానికి ఖరీదైన మందులు వాడినా ప్రయోజనం లేకపోవడంతో మనస్తాపానికి గురయి ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను బంధువులు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు.. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుబ్బారావు తెలిపారు.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు యువకుల అరెస్టు


కేసు వివరాలు తెలియజేస్తున్న సీఐ వంశీధర్, వెనక ముసుగులో నిందితులు

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: వ్యసనాలకు బానిసలై జిల్లాలోని పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను నల్లపాడు పోలీసులు అరెస్టు చేశారు. పోలీసు స్టేషన్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో సీఐ వంశీధర్ మాట్లాడుతూ.. గత నెలలో కళ్యం స్పిన్నింగ్ మిల్లు ఆఫీస్‌లో తాళాలు పగలగొట్టి దొంగలు నగదు అపహరించారు. మేడికొండూరులోని వైసీఆర్ కోల్డ్‌స్టోరేజి వద్ద ఓ ఇంటి తాళాలు పగలగొట్టి నగదు దొంగిలించారు. రెండు కేసులకు సంబంధించి బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గుంటూరు శారదకాలనీకి చెందిన మిక్కిలి సందీప్(24), పఠాన్ మస్తాన్‌వలి(23)లు రెండు చోట్ల దొంగతనం చేసినట్లు పోలీసులు గుర్తించారు. మిర్చి యార్డు సమీపంలోని వై జంక్షన్ వద్ద ఇద్దర్ని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి సుమారు రూ.5.15 లక్షల నగదు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన ఇద్దరిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని ఆయన తెలిపారు. దొంగలను అరెస్టు చేయటంలో చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బందిని జిల్లా ఎస్పీ, సౌత్ డివిజన్ డీఎస్పీలు అభినందించారని సీఐ తెలిపారు.

60 టన్నుల చౌక బియ్యం పట్టివేత

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న 60 టన్నుల చౌక బియ్యం బుధవారం సాయంత్రం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తాడికొండ నియోజకవర్గ పౌర సరఫరాల శాఖ అధికారి(సీఎస్‌డీటీ) దేవరాజ్ తెలిపిన వివరాల మేరకు.. పోలీసులు, స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి సీఎస్‌డీటీ మండలంలోని వేమవరం అడ్డురోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అటుగా వెళ్లే ఒక లారీ, రెండు ఆటోలను సోదా చేయగా వాటిల్లో చౌక బియ్యం కనిపించాయి. అనుమానంతో సమీపంలోని గోదామును తనిఖీ చేయగా మరిన్ని బస్తాల బియ్యం పట్టుబడ్డాయి. వాహనాలను ఫిరంగిపురం పోలీసులకు అప్పగించామని, ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఎస్‌డీటీ తెలిపారు.


గోదాములో నిల్వచేసిన బియ్యం బస్తాలు చూపుతున్న అధికారులు

చికిత్స పొందుతూ యువకుడి మృతి

తాడికొండ, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలు ఏర్పడ్డాయి. బంధువులను బెదిరించాలనే ఉద్దేశంతో విషద్రావకం తాగాడు..ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని పొన్నెకల్లుకు చెందిన మర్రిపూడి మురళీకృష్ణ(35) స్థిరాస్తి వ్యాపారం చేస్తుంటాడు. ఈ క్రమంలో కుటుంబంలో కలహాలు వచ్చాయి. భయపెట్టాలని అనుకుని విషద్రావకం తాగాడు. గుంటూరు సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మురళీకృష్ణ మృతి చెందాడు. బంధువులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనాల దొంగ పట్టివేత

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, గుంటూరు జిల్లాల్లో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని వీరవల్లి పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎస్సై శ్రీనివాస్ వివరాల ప్రకారం.. ఏలూరు సమీపంలోని కొత్తూరుకు చెందిన పోట్రు సాయిశేఖర్ వీరవల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు, విజయవాడ సత్యనారాయణపురం, గుంటూరు జిల్లా మంగళగిరి, ఏలూరులో ఒకటి చొప్పున ద్విచక్ర వాహనాలను చాకచక్యంగా అపహరించుకుపోయాడు. బుధవారం తిప్పనగుంట బస్టాప్ వద్ద అనుమానాస్పదంగా కన్పించడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. నిందితుడ్ని నూజివీడు కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై వివరించారు.

దస్తావేజు పోయినది

గుంటూరు జిల్లా, తాడికొండ మండలం, బండారుపల్లి, డోరు నెం. 6-40రు కాపురస్తులు ముప్పాళ్ళ నరసింహారావు గారి భార్య ముప్పాళ్ళ రోజరాణి (సెల్: 90525 16916) అను నేను నా పేరిటకు కొరిటెపాడు ఎస్ఆర్ఓ నందు రిజిష్టరు కాబడిన విక్రయ దస్తావేజు నెం. 4856/2018 ఒరిజినల్‌ను ది. 17-09-2024న బండారుపల్లి నుండి తాడికొండ రిజిస్ట్రారు ఆఫీసుకు వెళ్లుచుండగా మార్గమధ్యలో పోయినది. ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

గుంటూరు తూర్పు

వ్యాపారాలు లేక ఇబ్బంది పడుతున్నాం

పట్నంబజారు : ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వజ్రాల వెంకట నాగిరెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును అసోసియేషన్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. నాగిరెడ్డి మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాలు కారణంగా వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అధిక వడ్డీలకు అప్పులు తీసుకొచ్చి వ్యాపారాలు చేస్తున్న సరైన వ్యాపారాలు లేక ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారని పేర్కొన్నారు.


మంత్రి అచ్చెన్నాయుడికి వినతిపత్రం అందిస్తున్న వ్యాపారులు

తమ సమస్యల్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. విజయకుమార్, రవికుమార్, శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

ఎన్టీఆర్ సర్కిల్, న్యూస్‌టుడే : ప్రభుత్వ బీసీ వసతి గృహంలోని విద్యార్థులకు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ దుప్పట్లు పంపిణీ చేశారు. రాజాగారితోటలోని బీసీ హాస్టల్‌లో ఉన్న విద్యార్థులు దుప్పట్లు లేక ఇబ్బందులు పడుతున్నట్లు ఇటీవల వసతి గృహాన్ని తాను సందర్శించినప్పుడు గుర్తించామని చెప్పారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ సహకారంతో వీటిని అందించినట్లు పేర్కొన్నారు. ఆతుకూరి ఆంజనేయులు, నాగిరెడ్డి,


విద్యార్థినికి దుప్పటి ఇస్తున్న ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

ప్రకాశరావు, పూర్ణచంద్రరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

పట్నంబజారు, న్యూస్‌టుడే : ఏటుకూరు రోడ్డులోని శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో బుధవారం హుండీ లెక్కింపు కార్యక్రమం జరిగింది. దసరా నవరాత్రి ఉత్సవాలు ముగిసిన అనంతరం కానుకలు లెక్కించారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పి.సి.హెచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం రూ. 7,18,200 వసూలైనట్లు అధికారులు తెలిపారు. ఆలయ ఈవో.పాదర్తి దుర్గారావు, నిడుముక్కల


దేవాలయంలో కానుకలు లెక్కిస్తున్న భక్తులు

సురేష్, ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.



ధర వరలు

ఎన్టీఆర్ రైతు బజారులో ధరలు నిన్నటివి...(కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాట 48, వంగ 24, బెండ 22, పచ్చిమిర్చి 45, కాకర 34, క్యారెట్ 45, క్యాలిఫ్లవర్ 38, క్యాబేజీ 45, బీర 28, దొండ 26, బంగాళదుంప 39, ఉల్లిపాయలు 32, గోరుచిక్కుళ్లు 30, దోస 32, పొట్ల 32, మునగ 8, పెద్ద చిక్కుళ్లు 84, చామదుంప 40, మునగ 8, గోంగూర 10, తోటకూర 15, కొత్తిమీర 25, బీట్‌రూట్ 39, కీర 24, క్యాప్సికం 64, అల్లం 60, ఫ్రెంచి బీన్స్ 94, సొర 16, అరటి 7

-న్యూస్‌టుడే, పట్నంబజారు

రహదారి విస్తరణ పనులు ఇంకెన్నాళ్లో..?

పనుల జాప్యంతో ప్రజలకు తప్పని పాట్లు

నగరపాలక సంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే

నగరంలో మొదలు పెట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తికాక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. తూర్పు నియోజకవర్గంలో అత్యంత ప్రధాన రహదారి ఆర్టీసీ బస్టాండ్ వెనుకగా ఉన్న నందివెలుగు రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు గత ప్రభుత్వంలోనే మూడేళ్ల కిందట ప్రారంభమైంది. విస్తరణ పనులు, కాల్వల నిర్మాణాల్లో తీవ్ర జాప్యం చేయడంతో పాటు స్థలాలు కోల్పోయిన వారికి టీడీఆర్ బాండ్లు జారీ, పరిహారం అందజేతలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో పనులు సకాలంలో పూర్తికాక ఇటుగా వచ్చిపోయే ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఒక్కొకటిగా అభివృద్ధి పనులపై దృష్టి పెట్టడంతో నందివెలుగు రోడ్డు కూడా విస్తరణ పనులు వేగంగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా వినియోగంలోకి


ఆర్టీసీ బస్టాండ్ నుంచి బయటకు వచ్చే మార్గంలో గుంతలు


నందివెలుగు రోడ్డులో గులకరాళ్లు

తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

ఎన్.క్యాప్ నిధులతో పూర్తికి సన్నాహాలు..

ఎన్టీఆర్ విగ్రహం వద్దనున్న అన్నక్యాంటీన్ నుంచి కూర్చున్న గాంధీ బొమ్మ వరకు పనులు ఈ రహదారి నిర్మాణం చేపడుతున్నారు. ఇప్పటికే ఇరువైపులా ప్రధాన డ్రెయిన్ల నిర్మాణాలు పూర్తికాగా విద్యుత్తు స్తంభాల మార్పు పనులు చేశారు. విస్తరణ పనుల్లో భాగంగా కొంత వరకు పనులు చేసి ఆపారు. ఈ రోడ్డు విస్తరణ పూర్తి అయితే గుంటూరు నుంచి జాతీయ రహదారి వైపు, తెనాలి, నందివెలుగు వైపు వెళ్లే వారికి ఈ రహదారిలో మానస సరోవరం వరకు ఉన్న ప్రాంతాల వాసులకు ఉపయోగపడుతోంది.

పనులు ఇలా..

రోడ్డు పొడవు	- 385 మీటర్లు
వెచ్చిస్తున్న నిధులు	- రూ.2.3 కోట్లు
రహదారి వెడల్పు	- 100 అడుగులు
(ఎన్టీఆర్ విగ్రహం నుంచి జెండా చెట్టు వరకు)	
	- 80 అడుగులు
(జెండా చెట్టు నుంచి గాంధీ బొమ్మ వరకు)	

ఈ విషయమై స్థానిక ఏఈ సునీల్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. నేషనల్ క్లీన్ ఎయిర్(ఎన్.క్యాప్) నిధులు వెచ్చించి చేస్తున్న ఈ రహదారి నిర్మాణం వర్షాలు రావడంతో ఆగినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయని చెప్పారు.

18న బాలబాలికల చదరంగం పోటీలు

నగరపాలక సంస్థ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 బాల బాలికల చదరంగం పోటీలు ఈ నెల 18న గుంటూరులోని చౌత్రా ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జరుగుతాయని ఫెడరేషన్ కార్యదర్శి రవికుమార్ తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా విజేతలుగా నిలిచిన వారు ఈ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఇందులో గెలుపొందిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. చెస్ బోర్డు, కాయిన్స్ విద్యార్థులే తెచ్చుకోవాలని సూచించారు. విద్యార్థులు తాము చదివే పాఠశాల నుంచి వయసు నిర్ధారణ ధ్రువపత్రం, ఆధార్ కార్డు నకలు, స్టడీ సర్టిఫికెట్ తెచ్చుకోవాలని కోరారు.

హిందూ ఫార్మసీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

గుంటూరు విద్య, న్యూస్‌టుడే : స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో దివిస్ లాబొరేటరీస్(హైదరాబాద్) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికలకు విశేష స్పందన లభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తెలిపారు. దివిస్ సంస్థ హెచ్ఆర్డీ ప్రతినిధులు రామకృష్ణ, నవీన్ పలువురు విద్యార్థులకు రాత పరీక్ష, మౌఖికాలు నిర్వహించారు. ఇందులో 37 మంది హాజరు కాగా ఎంపికైన వారికి ఈ నెలాఖరులో జాబ్ ఆఫర్ లేఖలను పంపనున్నట్లు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

94406 38515, 80085 73097

స్పందనకు వందనం

★ పండ్ల మార్కెట్ సెంటర్‌లో వ్యర్థాలు పేరుకున్నాయని స్థానికులు 'ఈనాడు' 'మేమున్నాం..మీకు తోడుగా' ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన అధికారులు బుధవారం పారిశుద్ధ్య కార్మికుల చేత వ్యర్థాలను తొలగింపజేశారు. ఇక నుంచి వ్యాపార సముదాయాల వద్ద ఏర్పాటు చేసిన చెత్త డబ్బాల్లో వ్యర్థాల్ని వేయాలని అధికారులు సూచించారు.

★ పాత గుంటూరులోని రాజీవ్ గాంధీ గృహకల్ప సముదాయంలో వెళ్లే దారిలోని సైడు కాలువల్లో కొద్దిరోజులుగా శుభ్రపరచడం లేదని స్థానికులు 'మేమున్నాం..మీకు తోడుగా' ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై అధికారులు స్పందించారు. ఆ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న సైడు కాలువల్ని శుభ్రపరచి వ్యర్థాల్ని తొలగించారు.

★ సుద్దపల్లి డొంక రోడ్డులో కొద్దిరోజుల నుంచి వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు 'మేమున్నాం..మీకు తోడుగా' ద్వారా అధికారుల దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన అధికారులు సిబ్బందితో దీపాలకు మరమ్మతులు చేశారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

-న్యూస్‌టుడే, పట్నంబజారు

సమన్వయంతో స్వచ్ఛ గుంటూరుకు కృషి

నగరపాలక సంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే : స్వచ్ఛ గుంటూరు కోసం పారిశుద్ధ్య సిబ్బంది, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కమిషనర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం ప్రారంభం సందర్భంగా కమిషనర్ పట్టాభిపురం శానిటరీ కార్యాలయంలో హాజరు తనిఖీ చేశారు. కార్మికులు తీసుకున్న సెలవులు, రిజిస్టర్‌లో నమోదు చేసిన రోజులను వ్యక్తిగతంగా గమనించి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రతి డివిజన్‌లో పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు 90 రోజుల కార్యాచరణ ప్రారంభించినట్లు తెలిపారు. సిబ్బంది ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అరండల్‌పేటలో పూడికతీత పనులు పరిశీలించి డ్రెయిన్లపైకి వచ్చిన ఆక్రమణలు, హోటళ్లు తొలగించాలని యజమానులకు తెలియజేయాలన్నారు. స్పందించకుంటే వాటిని జేసీబీతో పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం పర్యవేక్షణాధికారి సుందరరామిరెడ్డి, నాగభూషణం, రమేష్‌బాబు, కార్పొరేటర్ చిష్తి తదితరులు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

మద్యం దుకాణాల నిర్వహణకు ఫుడ్ లైసెన్సు తప్పనిసరి

పట్నంబజారు, న్యూస్‌టుడే : ప్రభుత్వం నుంచి లాటరీ ద్వారా మద్యం దుకాణాలు దక్కించుకున్న నిర్వాహకులు విధిగా ఫుడ్ లైసెన్సు తీసుకోవాలని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ నూతలపాటి పూర్ణచంద్రరావు తెలిపారు. ఆయన బుధవారం 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం- 2006 ప్రకారం ఫుడ్ లైసెన్సు తీసుకోకుండా మద్యం విక్రయాలు చేసే వారిపై జాయింట్ కలెక్టర్ కోర్టు రూ.10 లక్షల మేర జరిమానా విధిస్తుందని చెప్పారు. గతంలో జిల్లాలో బార్లు, రెస్టారెంట్లు నిర్వహించిన 80 మంది ఇప్పటికే తమ శాఖ నుంచి లైసెన్సు పొందారని పేర్కొన్నారు. ఈ తరహాలో ప్రస్తుతం మద్యం దుకాణాలు దక్కించుకున్న 125 మంది నిర్వాహకులు ఫుడ్ లైసెన్సు తీసుకోవాలని సూచించారు. దీనికి దరఖాస్తు చేసుకొనే వారు ఎక్సైజ్ శాఖ నుంచి పొందిన అలాట్‌మెంట్ లెటర్‌తో పాటు, ఆధార్ కార్డు, లేబర్ లైసెన్సు, చిరునామా ధ్రువీకరణ పత్రాలు తీసుకొని కృష్ణనగర్ 2వ లైనులోని ఆహార భద్రత, నియంత్రణ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

స్వచ్ఛతతోనే ఆరోగ్య వాతావరణం


తాము గీసిన చిత్రాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

నగరపాలక సంస్థ(గుంటూరు): స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా చౌత్రా బాలికోన్నత పాఠశాలలో ఆదాయ పన్ను శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనంతో పాటు పలు అంశాల్లో పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఆదాయ పన్ను అదనపు కమిషనర్ సుప్రియరావు మాట్లాడుతూ బాల్యం నుంచే విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకత తెలియజేయాలని కోరారు. స్వచ్ఛతతోనే ఆరోగ్యకర వాతావరణం ఉంటుందని చెప్పారు.

వర్షం.. నగరవాసికి కష్టం


వీవర్స్ కాలనీ: గోతుల్లో నిలిచిన నీరు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే

నగరంలో బుధవారం కురిసిన వర్షానికి రహదారులు తటాకాలను తలపించాయి. అల్పపీడన ప్రభావంతో ఆకాశం నల్లని మబ్బులతో నిండిపోయింది. ఉదయం నుంచి రాత్రి వరకు వాన పడుతూ.. ఆగుతూ.. ఉంది. కొంతసేపు తెరిపించిన తరువాతలోనే ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో వ్యాపారాలు, విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు వెళ్లి వచ్చే వాళ్లు ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా నగరంలోని గుంటూరువారితోట, కొత్తపేట, డొంకరోడ్డు, నెహ్రూనగర్, శారదాకాలనీ, రాజీవ్‌గాంధీనగర్, సీతానగర్, రైల్వేస్టేషన్ రోడ్డు, బొంగరాలబీడు, పెదపలకలూరు, వీవర్స్‌కాలనీ తదితర లోతట్టు ప్రాంతాల్లో మురుగు నిలవడంతో వాహన చోదకులు, పాదచారులు నానా అవస్థలు పడ్డారు. గుంతలమయంగా మారిన రోడ్లలో మురుగు చేరడంతో అటుగా రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని నగరవాసులు అసహనం వ్యక్తం చేశారు. డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయడంతో పాటు రహదారులకు మరమ్మతులు చేసి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.


డొంకరోడ్డులో ఇలా...


మూడు వంతెనల వద్ద పరిస్థితి



నాటకోత్సవం ప్రారంభం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి, అభినయ ఆర్ట్ థియేటర్ ట్రస్టు, రాగార్ట్ మెమోరియల్ థియేటర్ ట్రస్టు, యశోద ఫౌండేషన్(గుంటూరు) సంయుక్త ఆధ్వర్యంలో నారా చంద్రబాబు నాయుడు నాటకోత్సవం బుధవారం రాత్రి స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ప్రారంభమైంది. నాటకోత్సవాన్ని నరసరావుపేట శాసనసభ్యుడు డా. చదలవాడ అరవిందబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా బోరివంక శర్వాణీ గ్రామీణ గిరిజన సాంస్కృతిక సంఘం వారు కొత్త పరిమళం నాటికను ప్రదర్శించారు. కేకేఎల్ స్వామి నాటకీకరణకు పట్నాయక్ దర్శకత్వం వహించారు. నాటకోత్సవ ప్రారంభ కార్యక్రమంలో భారతీయ విద్యా భవన్ కార్యదర్శి పి.రామచంద్ర రాజు, తెలుగుదేశం అధికార ప్రతినిధి దామచర్ల శ్రీనివాసరావు,


కొత్త పరిమళం నాటికలో ఓ సన్నివేశం

నాటక రంగ ప్రముఖులు ఆలోకం పెద్దబ్బయ్య, వ్యాపారవేత్త నాగళ్ల తిరుపతయ్య, తెలుగుదేశం పార్టీ గుంటూరు జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య, సాహితీ సమాఖ్య ప్రధానకార్యదర్శి ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, అభినయ థియేటర్ ట్రస్టు సలహాదారుడు జొన్నలగడ్డ శ్రీనివాసరావు, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి గద్దె లక్ష్మి పాల్గొన్నారు. కార్యక్రమాన్ని అభినయ శ్రీనివాస్, క్రోసూరి సుబ్బారావు, గుంటుపల్లి కృష్ణారావు, గుంటుపల్లి రమణబాబు నిర్వహించారు.

విద్యుత్తు ఒప్పంద కార్మికుల సమస్యలు పరిష్కరించండి

నెహ్రూనగర్: విద్యుత్తు ఒప్పంద కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 22న విద్యుత్తు భవన్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బి.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒప్పంద కార్మికులకు ఈపీఎఫ్, ఈఎస్ఐ చట్టబద్ధంగా కట్టాల్సి ఉండగా గత పది నెలలుగా కార్మికుల ఖాతాలో జమ చేయడం లేదన్నారు. జాతీయ, పండగల సెలవు రోజులకు ఇవ్వాల్సిన వేతన బకాయిలు సంవత్సరాలుగా కార్మికుల ఖాతాలో వేయడం లేదని ఆరోపించారు. సంఘ అధ్యక్షుడు పవన్, కోశాధికారి రాంబాబు, నాయకులు అశోక్, తిరుపతయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లక్ష్మణరావు, పక్కన పవన్, రాంబాబు

ఆలయ ఈవో తీరుపై విమర్శలు

గుంటూరు, న్యూస్‌టుడే : నగరంలో పేరొందిన అమ్మవారి దేవస్థానంలో విధులు నిర్వర్తించే ఈవో తన అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే వార్తలు వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేశాయి. సదరు ఈవో ఇటీవల దేవస్థానంలో జరిగిన దసరా ఉత్సవాల్లో అమ్మవారి మూలా నక్షత్రం రోజున చిన్నారులకు రాత పుస్తకాలు పంపిణీ చేయకుండా అడ్డుకున్నారని పలువురు ఆర్యవైశ్యులు వాట్సాప్ ద్వారా విమర్శలు గుప్పించారు. స్థానిక ఎమ్మెల్యే నియమించిన దసరా ఉత్సవ కమిటీ సభ్యుల్ని కించపరిచే విధంగా మాట్లాడారని కొంతమంది ఆరోపిస్తున్నారు. ఆ ఈవోపై ఎండోమెంట్ విజిలెన్స్ కమిషనర్‌కు ఫిర్యాదు ఇచ్చేందుకు ఆర్యవైశ్యులంతా సిద్ధమయ్యామనే వార్తలు వాట్సాప్‌లో హల్‌చల్ చేశాయి.

ఆటోలో ప్రయాణికుల వస్తువులు చోరీ

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆటోలో ప్రయాణికుడి వస్తువులు చోరీ చేసిన ఘటనపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బాపట్ల జిల్లా సంతమాగులూరుకు చెందిన రాములు అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం భార్య, మనవడితో కలసి గుంటూరు కొత్తపేటలోని ఓ ఆసుపత్రిలో అతను వైద్యం చేయించుకున్నారు. ఆ తర్వాత బస్టాండ్‌కు వెళ్లడానికి ముగ్గురు ఆటో ఎక్కారు. అప్పటికే అందులో చోదకుడి సీటు పక్కన ఒకరు, వెనక మరొకరు ఉన్నారు. ఆటో బోసుబొమ్మ కూడలికి రాగానే డ్రైవర్ ఆటో టైర్లలో గాలి తగ్గిందని వేరే ఆటో ఎక్కివెళ్లాలంటూ వారిని దించేసి వేగంగా వెళ్లిపోయారు. తర్వాత రాములు తన జేబు చూసుకుంటే పర్సు కనిపించక పోవడంతో నిర్ఘాంతపోయారు. ఆ పర్సులో తన భార్యకు చెందిన మూడున్నర సవర్ల బంగారపు గొలుసు, రూ.3,500 నగదు ఉన్నాయని ఆటోలో ఉన్న వాళ్లు చోరీ చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వీరయ్య తెలిపారు.

మహిళపై దాడి: కేసు నమోదు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : మహిళపై దాడి చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..యతిరాజుల కాలనీకి చెందిన నారాయణమ్మ భర్త సుబ్బరామయ్య అనారోగ్యంతో ఐదేళ్ల కిందట మృతి చెందారు. అప్పటి నుంచి ఆమె కూలి పనులు చేసుకుంటూ తన ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో పని చేసే వద్ద రవికుమార్ అనే వ్యక్తి ఆమెకు పరిచయమ్యాడు. ఈ నేపథ్యంలో బుధవారం రవికుమార్ మద్యం తాగి తన ఇంటికి వచ్చి గొడవ పెట్టుకొని పచ్చడిబండతో తలపగలకొట్టారని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వీరానాయక్ తెలిపారు.

గుంటూరు పశ్చిమ

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించండి


ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే మాధవి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే గల్లా మాధవి రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను కోరారు. బుధవారం సచివాలయంలో ఆయనతో ఎమ్మెల్యే మాధవి భేటీ అయ్యారు. ఆమె మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలు, నిర్లక్ష్యం కారణంగా నియోజకవర్గంలో పలు సమస్యలు పేరుకుపోయాయని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. గుంటూరులో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే మాధవి కోరారు. నియోజకవర్గంలోని నివాస ప్రాంతాలు అధికంగా ఉన్నాయి. రాజధాని ప్రాంతం కావడంతో పెద్ద షాపింగ్‌మాల్స్ వచ్చాయి. అందుకు తగిన విధంగా రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యం లేదు. ముఖ్యంగా నగరానికి సిటీలుక్ రావాలంటే ప్రత్యేకంగా నిధులు కేటాయించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. దీనికి మంత్రి పయ్యావుల కేశవ్ సానుకూలంగా స్పందించారు. సాధ్యమైనంత మేర వీలైనంత త్వరలో నిధులు కేటాయిస్తామన్నారు.

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే గల్లా మాధవి సూచించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు క్యాంపు కార్యాలయానికి చేరుకొని తమ సమస్యలను విన్నవించుకున్నారు. వారి సమస్యలను ఎమ్మెల్యే మాధవి ఆలకించారు. మంచినీరు సక్రమంగా రావడం లేదని గుజ్జనగుండ్ల వాసులు వాపోయారు. వేళాపాళా లేకుండా మంచినీరు సరఫరా చేయడంతో కంటి మీద కునుకు ఉండటం లేదని తమ గోడు వెళ్లబోసుకున్నారు. పారిశుద్ధ్యం క్షీణిస్తోందని, వ్యర్థాలు తొలగించడం లేదని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే మాధవి ఫోన్ చేసి తక్షణమే సమస్యల్ని పరిష్కరించాలని ఆదేశించారు.

నర్సుల సంఘం ఎన్నికకు నామపత్రాల దాఖలు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నికల్లో భాగంగా సర్వజనాసుపత్రిలో బుధవారం నామపత్రాల దాఖలు కార్యక్రమం పోటాపోటీగా జరిగింది. 17న నామినేషన్ల పరిశీలన, 18న ఉపసంహరణకు గడువు ఇచ్చారు. ఈనెల 23న ఎన్నికలు జరగనున్నాయి. అదేరోజు ఫలితాలను వెల్లడించనున్నారు. ప్రస్తుతం ఎన్నికల్లో రెండు ప్యానెల్ల మధ్య ప్రధాన పోటీ నెలకొంది. కొందరు వ్యక్తిగతంగానూ నామినేషన్లను దాఖలు చేయడం గమనార్హం. ఎన్నికల నిర్వహణకు సహకార శాఖకు చెందిన అధికారి ఎం.తులసీబ్రహ్మమ్మను నియమించారు.

మమ అనిపిస్తున్నారు..!

గుజ్జనగుండ్ల రహదారి దుస్థితి

గుజ్జనగుండ్ల(ఎస్వీఎన్‌కాలనీ), న్యూస్‌టుడే

గుంటూరు నగర రహదారులు దారుణంగా తయారయ్యాయి. నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యంగానే ఈ దుస్థితి వచ్చిందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు నగరంలో కలెక్టరేట్, బృందావన్‌గార్డెన్స్, కొరిటెపాడు, పలకలూరు, దామరపల్లి ప్రాంతాలను కలిపే గుజ్జనగుండ్ల ప్రధాన రహదారి అతుకుల బొంతగా మారింది. గుజ్జనగుండ్ల నుంచి జేకేసీ కళాశాలకు వెళ్లే రహదారి మలుపులో గుంతలు పడడం.. కొన్ని రోజులకు డస్ట్ పోసి మమ అనిపించడం. వర్షాలకు ఆ డస్ట్ కొట్టుకుపోవడం రివాజుగా మారింది. ఈ రహదారికి శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేసిన పాపాన పోలేదు. ఈ వారంలో కురిసిన వర్షాలకు డస్ట్ కొట్టుకపోగా, మళ్లీ సోమవారం రాత్రి డస్ట్ పోశారు. జేకేసీ కళాశాల వైపు వెళ్లే ఆటోలు రహదారి మీదే ఉంచడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. కొరిటెపాడు వైపు వెళితే సిటీ బస్సులు రహదారి మీదే నిలపడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆటోవాలాలు, బస్సు డ్రైవర్లను ప్రశ్నిస్తే అవమానంగా, పరుషంగా మాట్లాడుతున్నారని వాహనదారులు చెబుతున్నారు. కొన్ని రోజులపాటు ట్రాఫిక్ పోలీసును ఏర్పాటు చేశారు. ఆ తర్వాత వారి జాడలేదు.


జేకేసీ కళాశాల మలుపు వద్ద డస్ట్ పోసి వదిలేశారిలా..


దయనీయంగా గుజ్జనగుండ్ల-పలకలూరు రహదారి

అడుగడుగునా గుంతలే

గుజ్జనగుండ్ల-పలకలూరు రహదారిపై అడుగడుగునా గుంతలే దర్శనమిస్తాయి. ఈ గుంతలను డస్ట్‌తో పూడ్చారు. వర్షాలకు అది కొట్టుకుపోవడంతో మళ్లీ గుంతలే కనిపిస్తున్నాయి. కొన్ని గుంతలు అడుగు లోతు ఉండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ రహదారిలో రాకపోకలతో వెన్ను సమస్యలు ఏర్పడుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. కొన్ని గుంతలను అసలు పూడ్చకుండా వదిలేశారు. నెల కిందట ఒక షాపు ముందు డస్ట్ కుప్పపోసి అలాగే ఉంచేశారు. వినియోగదారులకు ఇది ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

విద్యుత్తుకు అంతరాయం నేడు

గుంటూరు విద్యుత్తు: విద్యుత్తు లైన్ల మరమ్మతుల నిమిత్తం ఈనెల 17న విద్యుత్తు సరఫరా నిలిపి వేస్తున్నట్లు డీఈఈ రాజమోహనరావు తెలిపారు. దీనివల్ల గురువారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సింహపురి ఎస్టేట్, జగదాంబ ఎస్టేట్, గంగయ్య ఎస్టేట్, పీకలవాగు, డంపింగ్‌యార్డు తదితర ప్రాంతాల్లో కరెంటు ఉండదని వెల్లడించారు.

ర్యాగింగ్ నిషేధంపై ప్రచారం

గుంటూరు వైద్యం: వైద్య కళాశాలలో ర్యాగింగ్‌ను నిషేధించిన విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు నరసింహం సూచించారు. విజయవాడ నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రిన్సిపల్ టీటీకే రెడ్డితో మాట్లాడుతూ ర్యాగింగ్ చేయను అని విద్యార్థి దగ్గర నుంచి ప్రవేశాలప్పుడే ప్రమాణపత్రం తీసుకుంటున్నందున, ఆ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన శిక్షలు తప్పవని అందరికీ తెలిసేలా ప్రచారం చేయాలని కోరారు. బోధనానిపుణుల హాజరును నిత్యం పర్యవేక్షిస్తుండాలన్నారు.

పెట్టుబడులపై అవగాహన అవసరం

గుంటూరు సాంస్కృతికం: వ్యాపారంలో పెట్టుబడులు ఎలా పెట్టాలనే అంశంపై నేటి యువతకు అవగాహన అవసరమని విజయవాడ ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్యశాస్త్ర అధ్యాపకుడు ఓలేటి అచ్యుత రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక హిందూ కళాశాల బీబీఏ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఇన్వెస్టర్ వారోత్సవాల సభ జరిగింది. సభలో కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి, ప్రిన్సిపల్ పీఎం ప్రసాద్ పాల్గొన్నారు.

నాటకోత్సవం ప్రారంభం


కొత్తపరిమళం నాటికలో ఓ సన్నివేశం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి, అభినయ ఆర్ట్ థియేటర్ ట్రస్టు, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్టు, యశోద ఫౌండేషన్(గుంటూరు) సంయుక్త ఆధ్వర్యంలో నారా చంద్రబాబునాయుడు నాటకోత్సవం బుధవారం రాత్రి స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ప్రారంభమైంది. నాటకోత్సవాన్ని నరసరావుపేట శాసనసభ్యుడు డా.చదలవాడ అరవిందబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా బొరివంక శర్వాణీ గ్రామీణ గిరిజన సాంస్కృతిక సంఘం వారు కొత్త పరిమళం నాటికను ప్రదర్శించారు. కేకే ఎల్ స్వామి నాటకోత్సవ పట్నాయక్ దర్శకత్వం వహించారు. మూడో ప్రపంచ యుద్ధ భయంతో ప్రజలు క్షణ క్షణం వణుకుతూ, నరక యాతన పడుతూ, బతుకీడుస్తున్నారు కాలం కథ ఇది. మనుషుల్లో మానవత్వం మంటగలిసిపోయి, జాతి, మత ద్వేషాలతో దేశాలు రగిలిపోతున్నాయి. వాటి మధ్య నలిగిపోయిన సగటు హద్దు జీవిత గాథే కొత్త పరిమళం నాటిక. అనంతరం సాహితీసూత్రం నాటికను కేజేఆర్ కల్చరల్ అసోసియేషన్ హైదరాబాదు వారు ప్రదర్శించారు. నాటకోత్సవ ప్రారంభ కార్యక్రమంలో భారతీయ విద్యా భవన్ కార్యదర్శి పి.రామచంద్ర రాజు, తెలుగుదేశం అధికార ప్రతినిధి దామచర్ల శ్రీనివాస రావు, నాటక రంగ ప్రముఖులు ఆలోకం పెద్దబ్బయ్య, వ్యాపారవేత్త నాగళ్ల తిరుపతయ్య, తెలుగుదేశం పార్టీ గుంటూరు జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య, సాహితీ సమాఖ్య ప్రధానకార్యదర్శి పి.ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, అభినయ థియేటర్ ట్రస్టు సంస్థాధ్యక్షుడు జొన్నలగడ్డ శ్రీనివాసరావు, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డే లక్ష్మి పాల్గొన్నారు. కార్యక్రమాన్ని అభినయ శ్రీనివాస్, క్రోసూరి సుబ్బారావు, గుంటుపల్లి కృష్ణారావు, గుంటుపల్లి రమణబాబు నిర్వహించారు.

ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా చూద్దాం


ప్రసంగిస్తున్న కిరణ్‌కుమార్, పక్కన ఉమాశంకర్


గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదమో, మంటలు అంటుకోవడమో, ఇంటి మీద నుంచి జారడమో కారణమేదైనా తీవ్ర గాయాలకు కారణమయ్యే ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా సమష్టిగా కృషి చేద్దామని సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ సూచించారు. సర్వజనాసుపత్రి శుశ్రూతాహాలులో బుధవారం 108 వాహనాల పైలెట్లతో నిర్వహించిన సమావేశంలో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రమాదం జరిగిన క్షణం నుంచే క్షతగాత్రుల సంరక్షణ మొదలవ్వాలన్నారు. ఆసుపత్రికి చేరేలోపు బాధితుల వివరాలను అత్యవసర విభాగంలోని వైద్యులకు తెలియజేయాలన్నారు. ఇందు కోసం ప్రత్యేకంగా వాట్సప్ గ్రూప్‌ను తయారు చేశామన్నారు. అందులో రోగికి సంబంధించిన వివరాలు పంపితే వెంటనే ఓపీ టికెట్ సిద్ధం చేసి ఉంచుతామన్నారు. దీనివల్ల క్షతగాత్రుడు ఆసుపత్రికి రాగానే ఎటువంటి జాప్యం లేకుండా చికిత్స ప్రారంభించేందుకు వీలవుతుందన్నారు. సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు శనక్కాయల ఉమాశంకర్, సీఎస్ఆర్ఎంవో సతీష్‌కుమార్, ఎస్పీఎం విభాగం అధిపతి సీతారామ తదితరులు పాల్గొన్నారు.

42వేలకు పైగా మిర్చి బస్తాలు విక్రయం

మిర్చియార్డు, న్యూస్‌టుడే: గుంటూరు మిర్చియార్డులో 42 వేలకు పైగా బస్తాలు విక్రయాలు జరిగాయి. రైతులు బుధవారం 45,003 బస్తాలు యార్డుకు తరలించారు. అందులో 42,845 బస్తాలు విక్రయాలు జరిగాయి. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో 25,483 బస్తాలు నిల్వ ఉన్నాయి. నాన్ ఏసీ కామన్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.8500-16200, నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.8500-18500, తాలు మిర్చికి రూ.5000-12000, ఏసీ కామన్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.8200-16500, ఏసీ స్పెషల్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.9800-18500, తాలు మిర్చికి రూ.5000-10500 ధర లభించింది.

వరద బాధితుల సహాయార్థం విరాళం

నగరంపాలెం, న్యూస్‌టుడే: వరద బాధితుల సహాయార్థం గుంటూరుకు చెందిన విజేత ఐఐటీ ఫౌండేషన్ డైరెక్టర్లు ఈ.వి.గిరిబాబు, ఎం.శ్రీనివాసరావు రూ.2.5 లక్షలు అందజేశారు. రాష్ట్ర మంత్రి లోకేశ్‌ను బుధవారం ఆయన కార్యాలయంలో కలిసి చెక్కు అందజేశారు.


మంత్రి లోకేశ్‌కు చెక్కు అందజేస్తున్న గిరిబాబు, శ్రీనివాసరావు తదితరులు

హిందూ ఫార్మసీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

గుంటూరు విద్య, న్యూస్‌టుడే : స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో దివిస్ లాబొరేటరీస్(హైదరాబాద్) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికలకు విశేష స్పందన లభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తెలిపారు. దివిస్ సంస్థ హెచ్ఆర్‌డీ ప్రతినిధులు రామకృష్ణ, నవీన్ పలువురు విద్యార్థులకు రాత పరీక్ష, మౌఖికాలు నిర్వహించారు. ఇందులో 37 మంది హాజరుకాగా ఎంపికైన వారికి ఈ నెలాఖరులో జాబ్ ఆఫర్ లేఖలను పంపనున్నట్లు తెలిపారు.

సమస్యలతో సహవాసం

24వ డివిజన్‌లోని ఆకులవారితోట, శాంతినగర్‌లో సమస్యలు తిష్ఠ వేశాయి. శాంతినగర్ 6వ లైన్‌లో రహదారి అధ్వానంగా ఉంది. శాంతినగర్ నుంచి ఆకులవారితోటకు వెళ్లడానికి మధ్యలో ఉన్న పీకల వాగుపై కల్వర్టు, రహదారి పనులకు సంవత్సర కిందట శంకుస్థాపన చేశారు. కొన్ని ఇసుక బస్తాలు తోలాక పనులు ఆగిపోయాయి. ఏటీ అగ్రహారం ప్రధాన రహదారి విస్తరణ పనులయ్యాకే పీకలవాగుపై కల్వర్టు, రహదారి పనులు జరుగుతాయని చెబుతున్నారు. పనుల కోసం పీకలవాగులో వేసిన ఇసుక బస్తాల వద్ద చెత్త, వ్యర్థాలు నిలిచిపోవడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. వాగు చుట్టూ ఉన్న ఫెన్సింగ్‌పై పిచ్చిమొక్కలు పెరగడంతో దోమలకు ఆవాసాలుగా మారాయి. పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని..స్థానికులు కోరుతున్నారు.

– ఏటి అగ్రహారం, న్యూస్‌టుడే


పీకలవాగు ఫెన్సింగ్‌ను అల్లుకున్న పిచ్చి మొక్కలు

స్థానికుల గోడు ఇదే..

సమస్యలపై స్థానికుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రహదారి సరిగా లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. రహదారి పనులకు శంకుస్థాపన చేసినా..ప్రారంభం కాలేదని వాపోయారు. మా లైన్‌లో వీధి దీపాలూ లేవని తెలిపారు. స్థానిక మహిళ గౌసియా మాట్లాడుతూ మా ఇంటి పక్కనే పీకల వాగు ఉంటుందని. .దానిలో చెత్త, వ్యర్థాలు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోందని తెలిపారు. దీంతో దోమలు పెరిగిపోయాయని..అధికారులు సమస్యను పరిష్కరించాలని ఆమె కోరారు.

వైభవంగా చండీహోమం



గుంటూరు సాంస్కృతికం : స్థానిక బృందావన గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో ఆశ్వయుజ పౌర్ణమి సందర్భంగా బుధవారం రాత్రి విశ్వశాంతిని కాంక్షిస్తూ చండీహోమం జరిగింది. పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతుల నిర్వహణలో తొలుత గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. లక్ష్మీగణపతి, చండీ, రుద్ర హోమాలు జరిగాయి. అనంతరం పూర్ణాహుతి చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

97042 53525, 80085 74897

కాల్వల్లో పూడిక తొలగింపు

స్పందనకు వందనం

☛ బ్రాడీపేట 14, 15, 16 అడ్డరోడ్లలోని మురుగుకాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోయి మురుగుపారుదల నిలిచిపోయింది. ఈ సమస్యను స్థానికులు 'మేమున్నాం మీకుతోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి బాబు దృష్టికి తీసుకు వెళ్లగా..ఆయన పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి కాల్వలో పూడిక తీయించి సమస్య పరిష్కరించారు.

☛ నగరంపాలెంలోని పలు వీధుల్లో కాల్వల్లో మురుగు పారుదల నిలిచిపోవడంతో సమస్యను స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేష్‌నాయక్ దృష్టికి తీసుకువెళ్లగా పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి వ్యర్థాలు తొలగించి సమస్య పరిష్కరించారు. -న్యూస్‌టుడే, బ్రాడీపేట

విద్యార్థులకు కంటి పరీక్షలు

ఏటి అగ్రహారం: ఎస్‌కేబీఎం ఉన్నత పాఠశాలలో శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా బుధవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. దృష్టిలోపం ఉన్న వారికి కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేస్తామని ప్రోగ్రాం కోఆర్డినేటర్ బి.గంగాధర్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, టెక్నీషియన్ ప్రసన్న పాల్గొన్నారు.



భగవద్గీతపై ప్రవచనం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదిక మీద బండ్లమూడి విజయలక్ష్మి సౌజన్యంతో భగవద్గీతలోని దశమ అధ్యాయంపై బుధవారం రాత్రి ప్రవచనం జరిగింది. చిన్మయామిషన్ సువీరానంద స్వామి ఈ ప్రవచనం చేశారు.

స్వచ్ఛ గుంటూరు సాధనకు కృషి

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : స్వచ్ఛ గుంటూరు కోసం పారిశుద్ధ్య సిబ్బంది, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కమిషనర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యాచరణ ప్రారంభం సందర్భంగా కమిషనర్ పట్టాభిపురం శానిటరీ కార్యాలయంలో హాజరు తనిఖీ చేశారు. కార్మికులు తీసుకున్న సెలవులకు, రిజిస్టర్‌లో నమోదు చేసిన రోజులకు వ్యత్యాసం గమనించి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అరండల్‌పేటలో పూడికతీత పనులు పరిశీలించి డ్రెయిన్లపైకి వచ్చిన ఆక్రమణలు, ర్యాంపులు తొలగించుకునేలా యజమానులకు తెలియజేయాలన్నారు. స్పందించకుంటే వాటిని జేసీబీతో పూర్తిగా తొలగించాలని ఆదేశించారు.

ప్రకృతి సాగు పంటలతో మేలు


మహిళా రైతు విజయలక్ష్మిని సన్మానిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు తదితరులు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయం కష్టంతో కూడుకున్నది..దానిని ఇష్టంగా ముందుకు తీసుకెళ్లాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. జిల్లా కలెక్టర్ బంగ్లారోడ్డులోని కృషిభవన్‌లో బుధవారం మహిళా రైతు దినోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రసాయన రహిత ఆహారం తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకుని వాటిని మరింత మంది మహిళలకు తెలియజేయాలన్నారు. మహిళల్లో వచ్చే క్యాన్సర్ వంటి వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో పండించిన పంటలతో మంచి ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈ విధానంలో రైతులు ముందుకు రాకపోవడానికి కొన్ని కారణాలున్నాయన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసిన పంటలకు ప్రత్యేక ధర లేకపోవడం, వాటిని ప్రత్యేకంగా గుర్తించకపోవడం వలన ఎక్కువ మంది రైతులు ఆసక్తి చూపడం లేదన్నారు. మహిళలు ప్రకృతి వ్యవసాయం చేస్తూ నలుగురికి ఆదర్శంగా నిలవడం గొప్ప విషయమన్నారు. అనంతరం మహిళా రైతు తోలు విజయలక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ డి.వెంకటేశ్వర్లు, ఆర్‌వైఎస్ఎస్ ఎస్‌టీఎల్ అరుణ, శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటలక్ష్మి, డాక్టర్ గంగాదేవి, ప్రకృతి వ్యవసాయం డీపీఎం కె.రాజకుమారి, గైనకాలజిస్ట్ డాక్టర్ సత్యప్రియ, మహిళా రైతులు పాల్గొన్నారు.